

జీజీహెచ్‌లో.. ఇష్టారాజ్యం

- ఐదేళ్లూ వైసీపీ సేవకే పరిమితం
- అవినీతి, అక్రమాలతో కోట్లలో గోల్‌మాల్
- కూటమి ప్రభుత్వంలోనైనా ప్రక్షాళన జరిగేనా?

గుంటూరు, జూలై 5: వైసీపీ ఐదేళ్ల పాలనలో గుంటూరు జిల్లాకే గాక తెలుగు రాష్ట్రాలకే ఆరోగ్య ప్రధాయనిగా పేరున్న గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి గాడి తప్పింది. వేలాది మంది రోగులతో కిటకిటలాడే ప్రభుత్వాస్పత్రిని అధికార యంత్రాంగం వ్యాపార కేంద్రంగా మార్చిందనే ఆరోపణలు ఉన్నాయి. రోగులకు చికిత్సలు అందించేకంటే వైసీపీ నేతల సేవలో వైద్యులు, అధికారులు తరించారన్న విమర్శలున్నాయి. కీలకమైన అధికార యంత్రాంగం వైసీపీకి దాసోహం అన్నట్టుగా ప్రవర్తించడం తీవ్ర విమర్శల పాలైంది. ఆస్పత్రిలో నాటి సీఎం జగన్ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం, వారి చిత్రపటాలకు పాలాభిషేకాలు మొదలు చివరకు ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేయాలంటూ ఉద్యోగులందరికీ ఉన్నతాధికారులు హుకుం జారీ చేసేదాకా పరిస్థితి వెళ్లింది. ఐసీయూ బెడ్స్, వెంటిలేటర్ల కొనుగోళ్లలో, భవన నిర్మాణాల్లోనూ అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. చెన్నైకి చెందిన ట్రాన్స్ హెల్త్ కేర్ కంపెనీ నుంచి కొనుగోలు చేయాలని వచ్చిన ఒత్తిడి మేరకు ఆస్పత్రిలో మూలనబడిన వెంటిలేటర్లు, మానిటర్ల విక్రయాల్లో రూ.3 కోట్ల వరకు అవకతవకలు జరిగాయి. ఆస్పత్రి అభివృద్ధికి వచ్చిన విరాళాల్లోనూ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన క్రమంలో జీజీహెచ్ ప్రక్షాళనపై పలువురు ఎదు రుచూస్తున్నారు.

సస్పెన్షన్ చేసినా మళ్లీ విధుల్లోకి..

స్టాఫ్ నర్స్ నియామకాల్లో జరిగిన అవకతవకలతో ప్రభుత్వ వైద్యశాలలో పరిపాలనా విభాగానికి చెందిన ఓ కీలక అధికారిని ప్రభుత్వానికి సరండర్ చేశారు. మరోసారి కోర్టు కేసు వ్యవహారంలో సస్పెండ్ చేశారు. అయితే ఆయన అంతా నా ఇష్టం, నన్నెవరూ ఏమీ చేయలేరు, వైసీపీ వారే నాకు పోస్టింగ్ ఇప్పిస్తారని బహిరంగంగా చెప్పేవాడు. ఆయన చెప్పినట్లుగానే రెండు నెలల్లో తిరిగి అదే స్థానానికి రావడం గమనార్హం.

తప్పుడు నివేదికలు.. కాదంటే చార్జిమెమోలు

అప్పట్లో ఎంపీ రఘురామకృష్ణరాజుపై సీఐడీ థర్డ్ డిగ్రీ ప్రయోగంపై కోర్టు ఆదేశాల మేరకు వైద్య పరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా అప్పటి సూపరింటెండెంట్ ప్రభావతి వైసీపీ నేతల ఆదేశాలతో తప్పుడు నివేదిక ఇవ్వడం తీవ్ర కలకలం రేపింది. ఆ తర్వాత అప్పటి మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే కారణంతో నమోదైన కేసులో టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తిని పోలీసులు అరెస్టు చేసి గుంటూరు కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌కు తరలించగా ఆయనకు చికిత్స అందించాలని వైద్యులు నివేదించారు. అయితే ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని నివేదిక ఇవ్వాల్సిందిగా సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ సంబంధిత వైద్యులపై ఒత్తిడి తెచ్చినట్లు ప్రచారం జరిగింది. అందుకు అంగీకరించని వారికి చార్జ్‌మెమోలు ఇచ్చి వేధింపులకు గురి చేసినట్లు కూడా ఆస్పత్రి వర్గాలు చర్చించుకున్నాయి.

అక్రమాలు కోకొల్లలు..

రోగులకు ఆహారం సరఫరాకు సంబంధించి ప్రభుత్వ షరతులు మార్చి సొంత షరతులతో అనేక మార్లు టెండర్ పిలిచారు. నిబంధనలు మార్పు గురించి, జరిగిన తప్పులపై హైకోర్టు కూడా ప్రశ్నించింది. కోవిడ్ సమయంలో నాశిరకమైన ఆహారం సరఫరా చేసినందున అప్పటి జేసీ ప్రశాంతి కాంట్రాక్టర్‌ను మార్చారు. ఆ సంస్థకు డబ్బులు చెల్లించకుండా వారిని ఇబ్బందులకు గురిచేసి జిల్లా అధికారుల అనుమతి లేకుండా తిరిగి మరలా పాత కాంట్రాక్టర్‌కే ఆహార సరఫరా బాధ్యతను అప్పగించి డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. గుత్తేదారు గడువు ముగిసినా నెలవారీ ముడుపులు తీసుకుని కాంట్రాక్టు పిలిచే విషయంలో జాప్యం చేశారు. ఈ విషయంలో జేసీ రాజకుమారిని సైతం తప్పు దారి పట్టించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ దస్త్రాన్ని సదరు అధికారి మాయం చేసినా సదరు అధికారి, సహకరించిన డైటీషియన్‌పై ఇప్పటి వరకు చర్యలు తీసికోకపోవడం గమనార్హం. అర్హత లేని సంస్థకు టెండర్ కట్టబెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆయా విషయాలు బయటకు రాకుండా ఉండటానికి, ఆధారాలు లేకుండా చేయడానికి డైట్ దస్త్రాన్నే మాయం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఫిర్యాదులు రాగా వైసీపీ నాయకులు, మంత్రుల జోక్యంతో చర్యలు తీసుకోలేదని సమాచారం.

- ప్రభుత్వ వైద్యశాలలో పొరుగు సేవల కింద హెచ్‌డీఎస్ ద్వారా హెచ్‌ఎంఐఎస్ సేవలు అందిస్తున్న సంస్థను మార్చి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి సిఫార్సుపై హెచ్‌ఎంఐఎస్ సేవల కాంట్రాక్టు స్థానిక వైసీపీ నాయకుడుకి చెందిన వైఎస్సార్ మెడి టెక్ సంస్థకు కట్టబెట్టేందుకు పలు దఫాలు ఓ ఎమ్మెల్యే కార్యాలయానికి ఈ దస్త్రాన్ని సదరు అధికారి, సంబంధిత ఉద్యోగి ద్వారా 2019లో తీసుకెళ్లారు. నేటి వరకు ఆ దస్త్రం ఆమోదం పొందలేదు, తదుపరి అది మాయమైందనే ఆరోపణలు ఉన్నాయి.
- ప్రభుత్వ వైద్యశాలలో 2019- 20 నుంచి 2022-23 సంవత్సరాల మధ్య సైకిల్ స్టాండ్ నిర్వహణ ఎవరికి కేటాయించారో తెలియదు. అయితే ఐదేళ్ళ పాటు యథేచ్ఛగా సైకిల్ స్టాండ్ పేరుతో పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడ్డారు. సైకిల్ స్టాండ్‌కు సంబంధించి కలెక్టర్ ఇచ్చిన అనుమతులు, అందుకు సంబంధించిన దస్త్రంపై నీలినీడలు అలముకున్నాయి.
- ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన 250 స్టాఫ్ నర్స్‌ల నియామకంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. నలుగురు అక్రమంగా ఉద్యోగం పొందగా వారిని తొలగించారు. సదరు అధికారి సొంత కోటరీని ఏర్పరచుకుని అక్రమ దందాలు, వసూళ్లకు తెరలేపి, కలెక్టర్‌ని సైతం పక్క దారి పట్టించి అర్హతలేని వారికి ఉద్యోగాలు కల్పించారన్న ఆరోపణలున్నాయి. ఇద్దరికీ సైన్సు గ్రూప్ విద్యార్హత లేకున్నా కార్డియాలజీ విభాగంలో ఒకరికి, ఈఎన్‌టీ విభాగంలో మరొకరికి ఉద్యోగాలు ఇచ్చారు. వీటిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించడంతో సదరు ఉద్యోగులచే రాజీనామా చేయించారు. ఈఎన్‌టీ విభాగంలో ఉద్యోగం పొందిన వ్యక్తి తను ముడుపుగా చెల్లించిన నగదును రాబట్టుకునేందుకు దివ్యాంగుల నుంచి వేలల్లో నగదు వసూలు చేయగా, జిల్లా అధికారులకు తెలిసి అతడ్ని తొలగించారు. ఈ విభాగంలో ఆ పోస్టును భర్తీచేయకపోవడంతో సదరం సర్టిఫికెట్లు జారీ చేయడం లేదు.

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ.. జేఎన్టీయూ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ. ఇక్కడ చదువుకోవాలని విద్యార్థులు పోటీ పడుతుంటారు. ఆ విద్యా సంస్థ తమ ప్రాంతంలో ఉంటే అదో గుర్తింపుగా ఆ ప్రాంతవాసులు భావిస్తారు. అలాంటిది నరసరావుపేట సమీపంలో జేఎన్టీయూకేను 2016లో ప్రారంభించారు. ఈ విద్యా సంస్థపై గత వైసీపీ పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. అది టీడీపీ హయాంలో వచ్చిందనో మరే కారణం వల్లనో కానీ ఐదేళ్లుగా పట్టించుకోలేదు. కళాశాల నిర్వహణపై కాకినాడ జేఎన్టీయూ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ఈ కారణంగా భవనాల నిర్మాణాల నుంచి అధ్యాపక నియామకాల వరకు వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. ఈ కారణంగా ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో అడ్మిషన్లకు విద్యార్థులు వెనుకంజ వేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు కూడా వసతికి, రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా ఇటు ప్రభుత్వం.. అటు వర్సిటీ పాలకవర్గం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. వర్సిటీ వీసీ ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వ హయాంలో కళాశాలకు మంచి రోజులు వస్తాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

జేఎన్టీయూపై.. నిర్లక్ష్యం

- పాలకులకు పట్టని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థ
- అధ్యాపకుల కొరతతో నష్టపోతున్న విద్యార్థులు
- నరసరావుపేట కళాశాలలో నత్తనడకన నిర్మాణాలు
- కొత్త వీసీ నియామకంతోనైనా నిర్వహణ గాడిలో పడేనా?

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఐదు బ్రాంచ్‌లు.. వెయ్యి మంది విద్యార్థులు ఉన్న నరసరావుపేట జేఎన్టీయూ(కే) కళాశాల అనేక సమస్యలతో సతమతమవుతున్నది. వర్సిటీ పెద్దల నిర్లక్ష్యానికి నరసరావుపేట కళాశాల బలైంది. ఇక్కడి కళాశాలను అభివృద్ధి చేయడం వర్సిటీ అధికారులతో పాటు గత పాలకులకు ఇష్టం లేదన్న విమర్శలున్నాయి. కళాశాలను నిర్వీర్యం చేసేలా సదరు అధికారులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు కూడా వస్తున్నాయి. గత విద్యా సంవత్సరంలో ఈ కళాశాలలో 80 సీట్లు భర్తీ కాకపోవడం ఇక్కడి దయనీయస్థితిని తెలియజేస్తున్నది. సాధారణంగా జేఎన్టీయూ కళాశాలలో చేరేందుకు ఇంజనీరింగ్ విద్యార్థులు పోటీ పడతారు. కానీ ఆ పరిస్థితి ఈ కళాశాలలో లేదు. కళాశాలను ప్రారంభించి సుమారు ఎనిమిదేళ్లు అవుతున్నా ఇప్పటికీ భవన నిర్మాణాలు ఒక కొలిక్కిరాలేదు. ఇక అధ్యాపకుల నియామకాలు కూడా సక్రమంగా జరగడంలేదు. అటు తరగతుల నిర్వహణకు, ఇటు వసతికి విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కళాశాల, వసతి గృహాల భవనాల నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయింది. నరసరావుపేట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు నిత్యం రాకపోకలకు విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. పూర్తికాని భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రాంగణంలో వసతి గృహాలు లేక వసతికి విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. అధ్యాపకుల కొరతతో బోధన సక్రమంగా ఉండటం లేదు.



స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవనం

ఖాళీల వివరాలు ఇలా..

క్యాడర్	ఉండాల్సిన వారు	ఉన్నవారు	ఖాళీ
ప్రొఫెసర్	8	1	7
అసోసియేట్లు	18	2	16
అసిస్టెంట్లు	53	4	49

ఐదేళ్లుగా సాగుతున్న నిర్మాణాలు..

కళాశాల భవనాల నిర్మాణానికి జేఎన్టీయూ కాకినాడ రూ.90 కోట్లు మంజూరు చేసింది. రూ.28 కోట్లతో పరిపాలన, ప్రయోగశాలలు, తరగతి గదుల నిర్మాణాలను చేపట్టారు. అయితే ఐదేళ్లుగా నిర్మాణ పనులు సాగదీస్తున్నారు. తరగతులు నిర్వహించేందుకు వీలుగా పనులు పూర్తి చేశారే తప్ప పూర్తి స్థాయిలో పనులు చేయలేదు. వసతి గృహాల నిర్మాణాన్ని రూ.62 కోట్లతో చేపట్టారు. ఏళ్లు గడుస్తున్నా ఆ పనులు పూర్తికి నోచుకోలేదు. ప్రారంభం కానున్న విద్యా సంవత్సరానికి కూడా ఇక్కడ వసతి గృహాల భవనాలు అందుబాటులోకి వచ్చే పరిస్థితులు కానరావడంలేదు. బాలికల వసతి గృహాలలో ఒక బ్లాక్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మారో బ్లాక్, బాలుర వసతి గృహాల నిర్మాణాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా పనులను వేగవంతంగా చేయాల్సి ఉన్నా వర్సిటీ పెద్దలు చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలున్నాయి.

అతిథి అధ్యాపకులే దిక్కు..

కళాశాలలో వెయ్యి మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నా ఉద్దేశపూర్వకంగా వర్సిటీ పాలకులు అధ్యాపకులను నియమించడంలేదు. అతిథి అధ్యాపకులతో కాలం గడుపుతున్నారు. 2016లో ప్రారంభమైన కళాశాలలో సివిల్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఈఈఈ, ఈసీఈ బ్యాంచ్‌లు 60 సీట్ల చొప్పున ఉన్నాయి. 2018 డిసెంబరులో టీడీపీ ప్రభుత్వం కళాశాలకు 80 అధ్యాపక పోస్టులను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి రూ.7.11 కోట్లు వార్షిక బడ్జెట్‌ను కేటాయించింది. 9 మంది ప్రొఫెసర్లు, 53 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 18 మంది అసోసి యేట్ ప్రొఫె సర్లను కళాశాలకు మంజూరు చేస్తూ జీవోను విడుదల చేసింది. అయితే ఆయా అధ్యాపకులను యూనివర్సిటీ నేటికీ నియమించలేదు. పర్మినెంట్ అధ్యాపకులు ఏడుగురు మాత్రమే కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రొఫె సర్ పోస్టులు మొత్తం ఖాళీగానే ఉన్నాయి. ఉన్నది ఒకే ఒక ప్రొఫెసర్ అది కూడా ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు. ఆయనను ఇటీవల బదిలీ చేయగా 'జేఎన్టీయూపై నీలినీడలు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంతో బదిలీని వర్సిటీ నిలిపివేసింది. అసోసి యేట్ ప్రొఫెసర్లు ఇద్దరు ఉండగా వారిలో క్రీడలకు సం బంధించి ఒకరు. పర్మినెంట్ అధ్యాపకులను నియమిం చాల్సిన వర్సిటీ అతిథి అధ్యాపకులతో కాలం వెళ్లబుచ్చు తున్నది. మొత్తంమీద 73 మంది అధ్యాపకుల కొరత ఉంది. నామమాత్రంగా కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించి చేతులు దులుపుకుంది. కనీసం అధ్యాపకులను కాంట్రాక్టు పద్దతిలో నియమించే విషయంలోనూ వర్సిటీ అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు.

విద్యార్థులకు అన్యాయం

అధ్యాపకుల కొరత కారణంగా ప్రతిభ కలిగిన విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోంది. అధ్యాపకుల కొరతతో విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలను కోల్పోతున్నారు. ఉద్యోగాలకు ఎంపికయ్యే విద్యార్థుల సంఖ్య ఏటేటా తగ్గిపోతోంది. 2021లో 180 మంది క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 2022లో 150 మంది, 2023లో 110 మంది ఉద్యోగాలు సాధించారు. 2024లో కేవలం 72 మంది మాత్రమే ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఏటా ఉద్యోగాలు పొందే విద్యార్థుల సంఖ్య పెరగాల్సి ఉండగా ఈ కళాశాలలో దారుణంగా పడిపోతున్నట్లు సదరు లెక్కలు తెలియజేస్తున్నాయి.



బాలికల వసతి గృహం



బాలుర వసతి గృహం



నిర్మాణంలో ఉన్న భవనాలు

సాగునీటి కాల్వల్లో అత్యవసర పనులపై సమీక్ష
మరమ్మతులకు.. ప్రతిపాదనలు

- డెల్టాలో రూ.14 కోట్లు, సాగర్ కాల్వలకు రూ.22.54 కోట్లకు అంచనాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానన్న మంత్రి నిమ్మల

గుంటూరు, నరసరావుపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టా, సాగర్ కుడి కాల్వ పరిధిలో అత్యవసరంగా చేపట్టాల్సిన మరమ్మతులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు స్వీకరించింది. శుక్రవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తన కార్యాలయంలో సమీక్షించారు. డెల్టా, సాగర్ పరిధిలో అవసరమైన పనులను గుంటూరు ఇరిగేషన్ అధికారి ఉమామహేశ్వరరావు, సాగర్ కెనాల్స్ సీఈ, ఎస్ఈలు నివేదించారు. షట్టర్లు, కాల్వల గట్లు బలోపేతం చేయడం వంటి పనులను ప్రతిపాదించారు. డెల్టాకు సంబంధించి రూ.14 కోట్లు, సాగర్ కాల్వలకు రూ.22.54 కోట్లు అవసరమౌతాయని ఆయా అధికారులు మంత్రికి నివేదించారు. అన్ని జిల్లాల నుంచి ప్రతిపాదనలు తెప్పించుకున్న అనంతరం సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లి అనుమ తులు తీసుకుంటామని మంత్రి అధికారులకు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో త్వరలోనే నిధులు మంజూ రౌతాయని అధికారులు ఆశిస్తున్నారు.

రూ.కోట్లు ఖర్చు పెట్టినా నిరుపయోగం..

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కాల్వలు, డ్రెయిన్లకు సంబంధించి ఎలాంటి పనులు చేపట్టలేదు. కేవలం ఓఅండ్ఎం పనుల పేరుతో కేవలం నాచు, తూటికాడ తొలగింపునకు రూ.కోట్లు ఖర్చు పెట్టారు. వాటి వల్ల ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. కొద్ది రోజుల్లోనే మళ్లీ నాచు, తూటికాడ పెరిగిపోయి కాల్వల్లో నీటి ప్రవాహానికి ప్రతిబంధకాలు ఏర్పడేవి. జిల్లా నీటిపారుదల సలహా మండలి, సమీక్ష మండలి సమావేశాల్లో తూతూ మంత్రంగా సమీక్షలు మినహా కాల్వలు, డ్రెయిన్లను పట్టించుకోలేదు. ఏటా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లోనూ నిధుల కేటాయింపు జరపలేదు. ఈ కారణంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని సాగునీటి కాల్వల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. కాల్వల గట్లు పూర్తిగా బలహీనపడిపోయాయి. పూర్తి సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేస్తే షట్టర్లు కొట్టుకుపోయేలా ఊగిసలాడుతున్నాయి. అలానే లీకుల కారణంగా నీరు వృథా అవుతున్నది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో తొలుత రూ.13.72 కోట్లతో కనీస పునరావాస మరమ్మ తులు చేపట్టారు. వీటితో పాటు అత్యవసరంగా చేపట్టాల్సిన పనుల పైనా ప్రతిపాదనలను మంత్రి స్వీకరించారు. ఈ రెండు పనులు జరిగితే రెండేళ్ల పాటు కాల్వల్లో నీటి పారుదలకు ఆటంకాలు ఉండవు. ఆ తర్వాత నిధుల లభ్యతని బట్టి పూర్తిస్థాయి మరమ్మ తులు గురించి ఆలోచన చేయవచ్చు.

ఖరీఫ్ సాగుపై చర్చ

సమావేశంలో ఖరీఫ్ పంటల సాగు పైనా చర్చ జరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం పులిచింతల డ్యాంలో కేవలం అర టీఎంసీ నీరు మాత్రమే ఉన్నది. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్ నుంచి వరద వస్తే నీటిని దిగువకు విడుదల చేయలేని పరిస్థితి నెలకొన్నది. ప్రత్యామ్నాయంగా పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా నీటిని తరలించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. తొలుత డెల్టా పరిధిలో అన్ని చెరువులను నింపి ఆ తర్వాత సాగునీటిపై ఆలోచన చేద్దామని మంత్రి రామానాయుడు అధికారులకు తెలిపారు. ఆ మేరకు ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా ఆదేశించారు.



గోవిందాపురం కాలువలో పెరిగిన కంప చెట్లు

జగన్ నిర్వాకం.. రూ.300 కోట్ల భారం

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లను పాడుబెట్టారు
- అత్యాధునిక సదుపాయాలతో టీడీపీ హయాంలో నిర్మాణం
- 9 నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశాలు
- ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే క్వార్టర్స్ పరిశీలనలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

తుళ్లూరు/ గుంటూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): 'అమరావతి రాజధాని ప్రాంతంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాల కోసం క్వార్టర్లు నిర్మించగా.. జగన్ వాటిని పాడుబెట్టారు. వైసీపీ పాలకుల తీరు కారణంగా ప్రస్తుతం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్లను పూర్తి చేయడానికి రూ.300 కోట్ల అదనపు భారం పడింది. మిగిలిన పనులు పూర్తి చేసి తొమ్మిది నెల ల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అప్పగిస్తాం..' అని శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. రాజధాని అమరావతిలోని ఎమ్మెల్యే ఎమ్మెల్సీ భవన సముదాయాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన భవన సముదాయాలను చూసి ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లను మించిన అత్యాధునిక సదుపాయాలతో చంద్రబాబు అమరావతిలో నిర్మించారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అద్భుతమైన ప్రణాళికతో 90 శాతం పూర్తి చేయగా అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ నాశనం చేశారన్నారు. ఒక నాయకుడి అనాలోచిత పాలన వల్లే ఐదేళ్ల క్రితం ఆగిన భవనాలు నేడు శిథిల స్థితికి చేరాయన్నారు. క్వార్టర్లలోని ఇనుప సామగ్రి మొత్తం తుప్పు పట్టిపో యింద న్నారు. ఈ ప్రాంతంలోని సామగ్రిని కూడా కొందరు దొంగలించుకుపోయినట్లు తెలిసిందన్నారు. వారి నిర్వాకం వల్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి ఇప్పుడు రూ.300 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ దృష్టికి తీసుకువెళ్లి బడ్జెట్ కేటాయించేలా చేసి 9 నెలల్లో భవనాల నిర్మాణం పూర్తి చేసి ప్రజాప్రతినిధులకు అప్పగిస్తామన్నారు. రాష్ట్రంలో 280 మంది ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఉన్నారని, ఈ భవన నిర్మాణాలు ఆగిపోవడంతో వారంతా ఇబ్బంది పడుతున్నారన్నారు. వారికి ఆవాసం ఏర్పాటు చేయడం స్పీకరుగా తన బాధ్యత అని, అందుకే భవనాల పరిస్థితిని పరిశీలించినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో ఒక్కసారి కూడా అసెంబ్లీకి సున్నం కూడా వేయించలేదన్నారు. ఆగిపోయిన గ్రంథాలయాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ ఆవరణలో ప్రజా ప్రతినిధులకే కాకుండా, వచ్చే విజిటర్లకు కూడా భోజన వసతి కల్పించేలా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, విష్ణుకుమార్‌రాజు, సీఆర్డీఏ ఇంజనీరింగ్ అధికారులు ధనుంజయ శివకుమార్ తదితరులు ఉన్నారు.



అమరావతిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలను పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

తెలంగాణ ఈఏపీసెట్ కౌన్సెలింగ్



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'టీజీ ఈఏపీ సెట్ 2024 (ఎంపీసీ స్ట్రీమ్) కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ కౌన్సెలింగ్ ద్వారా బీఈ/బీటెక్/ఫార్మసీ కోర్సుల్లో అడ్మిషన్స్ ఇస్తారు. అభ్యర్థులు టీజీ ఈఏపీ సెట్ 2024లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీట్ల అలాట్‌మెంట్ ఉంటుంది. కౌన్సెలింగ్‌లో భాగంగా ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, స్లాట్ బుకింగ్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్స్ ప్రక్రియలు ఉంటాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కౌన్సెలింగ్ ప్రక్రియను మూడు విడతల్లో నిర్వహిస్తారు. చివరలో స్పాట్ అడ్మిషన్స్ ఉంటాయి.

అర్హత: అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు కనీసం 40 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థులందరూ టీజీ ఈఏపీ సెట్ 2024(ఎంపీసీ స్ట్రీమ్) అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులకు 16 ఏళ్లు; ఫార్మాడీ(డాక్టర్ ఆఫ్ ఫార్మసీ) కోర్సుకు 17 ఏళ్లు నిండి ఉండాలి. స్కాలర్‌షిప్ పొందాలంటే 2024 జూలై 1 నాటికి జనరల్ అభ్యర్థులకు 25 ఏళ్లు, రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు 29 ఏళ్లు మించకూడదు.

స్లాట్ బుకింగ్: వెబ్‌సైట్ ఓపెన్ చేసి 'పేమెంట్ ఆఫ్ ప్రాసెసింగ్ ఫీ' లింక్‌పై క్లిక్ చేయాలి. టీజీ ఈఏపీసెట్ 2024 హాల్‌టికెట్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్, ఇంటర్ హాల్ టికెట్ నెంబర్ ఎంటర్ చేయాలి. తరవాత ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడీ తదితర సమాచారం ఎంటర్ చేయాలి. ప్రాసెసింగ్ ఫీజు కింద జనరల్, బీసీ అభ్యర్థులు రూ.1200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.600 చెల్లించాలి. తరవాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం దగ్గరలోని హెల్ప్ లైన్ సెంటర్, డేట్, టైమ్ సెలెక్ట్ చేసుకోవాలి. దివ్యాంగులు, ఎన్‌సీసీ అభ్యర్థులు, క్రీడాకారులు, సీఏపీ అభ్యర్థులు, ఆంగ్లో ఇండియన్ వంటి స్పెషల్ కేటగిరీ అభ్యర్థులు మాత్రం హైదరాబాద్-మాసబ్‌ట్యాంక్ వద్దగల గవర్నమెంట్ పాలిటెక్నిక్ సెంటర్‌ను ఎంచుకోవాలి. ఈ కేటగిరీలకు నిర్దేశించిన తేదీల ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. క్రీడాకారులు, సీఏపీ అభ్యర్థులకు జూలై 6 నుంచి 8 వరకు; ఎన్‌సీసీ అభ్యర్థులకు జూలై 9 నుంచి 12 వరకు; దివ్యాంగులు, ఆంగ్లో ఇండియన్ అభ్యర్థులకు జూలై 13న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్: హెల్ప్‌లైన్ సెంటర్‌కు వెళ్లే అభ్యర్థులు తమ వెంట టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ కార్డ్, హాల్ టికెట్; ఆధార్ కార్డ్; పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్ మెమో-పాస్ సర్టిఫికెట్, ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ; 2024 జనవరి 1న గానీ ఆ తరవాత గానీ తీసిన ఇన్‌కం సర్టిఫికెట్; వ్యాలిడ్ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్; కులం, స్థానికత, వైకల్యం, ఎన్‌సీసీ, క్రీడలు తదితర ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకెళ్లాలి.

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తరవాత అధికారులు ఇచ్చిన ఆర్‌ఓసీని చెక్ చేసుకోవాలి. తరవాత అభ్యర్థుల మొబైల్‌కు లాగిన్ ఐడీ పంపుతారు. ఈ ఐడీ వచ్చిన తరవాతనే హెల్ప్‌లైన్ సెంటర్ నుంచి బయటకు రావాలి. దీని ద్వారా అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చు.

ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 12 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 6 నుంచి 13 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 15 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 15
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 19
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 19 నుంచి 23 వరకు

సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 26
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 27
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 27 నుంచి 28 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 28
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 31
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు

ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** ఆగస్టు 8
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** ఆగస్టు 9
- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 9 నుంచి 10 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** ఆగస్టు 10
- **సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 13
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** ఆగస్టు 13 నుంచి 15 వరకు

సెంట్రలైజ్డ్ ఇంటర్నల్ స్లయిడింగ్ షెడ్యూల్

- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 21 నుంచి 22 వరకు
- **ఫ్రీజింగ్ ఆప్షన్స్:** ఆగస్టు 22
- **సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 26
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** ఆగస్టు 27 నుంచి 28 వరకు
- **స్పాట్ అడ్మిషన్స్ గైడ్‌లైన్స్ విడుదల:** ఆగస్టు 28
- **వెబ్‌సైట్:** tgeapcet.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0fXXywPలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఎన్‌జీ రంగా వర్సిటీలో యూజీ ఎన్ఆర్ఐ కోటా

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)-వ్యవసాయ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అడ్మిషన్‌కు ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్ అవసరం లేదు. ఇంటర్/తత్సమాన కోర్సులో సాధించిన మార్కుల ఆధారంగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్‌లు-సీట్లు: బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 23 సీట్లు, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు చొప్పున మొత్తం 205 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌నకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదో తరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయం ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- **వెబ్‌సైట్:** angrau.ac.in

ఐఐపీలో ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లు

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. కోర్సుకు నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐఐపీ సెట్)2024, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఆన్‌లైన్ మోడ్‌లో సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్ కోర్సును కూడా అందిస్తున్నారు. దీని వ్యవధి ఏడాది. ఈ కోర్సులో ప్రవేశానికి ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. కోర్సులు పూర్తయ్యే నాటికి క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తారు.

సీట్లు

పీజీ డిప్లొమా: ముంబై క్యాంపస్‌లో 280 సీట్లు, కోల్‌కతా క్యాంపస్‌లో 80 సీట్లు, అహ్మదాబాద్ క్యాంపస్‌లో 60 సీట్లు ఉన్నాయి.
ఎంఎస్: హైదరాబాద్ క్యాంపస్‌లో 40 సీట్లు ఉన్నాయి.
సీపీఈ: చెన్నై క్యాంపస్‌లో 60 సీట్లు ఉన్నాయి.

కోర్సులు

- పీజీ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్
- ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ
- సీపీఈ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ



అర్హత: పీజీడీపీ ప్రోగ్రామ్‌నకు గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/మైక్రోబయాలజీ/బయో కెమిస్ట్రీ ఒక సబ్జెక్టుగా డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అగ్రికల్చర్/ఫుడ్ సైన్స్/పాలిమర్ సైన్స్/ఇంజనీరింగ్/టెక్నాలజీ డిగ్రీ అభ్యర్థులు కూడా అర్హులే. ఎంఎస్ ప్రోగ్రామ్‌నకు బీఈ/బీటెక్/నాలుగేళ్ల డిగ్రీ ఇన్ ఇంటిగ్రేటెడ్ సైన్సెస్ ఉత్తీర్ణులై ఉండాలి. సీపీఈ ప్రోగ్రామ్‌నకు బీఈ/బీటెక్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసిన/రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కరస్పాండెన్స్, పార్ట్ టైం డిగ్రీలు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. పీజీడీపీ, ఎంఎస్ ప్రోగ్రామ్‌లకు అభ్యర్థుల వయసు 2024 మే 31 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. సీపీఈ ప్రోగ్రామ్‌నకు వయోపరిమితి నిబంధనలు లేవు.

ఐఐపీ సెట్: ఇది ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంజనీరింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. అభ్యర్థులు నిర్దేశిత సంఖ్య మేరకు ప్రశ్నలు ఎంచుకొని సమాధానాలు గుర్తించాలి.

ఎంపిక: సంస్థ నిర్ణయించిన ప్రకారం కటాఫ్ మార్కులు సాధించిన వారిని షార్ట్‌లిస్ట్ చేసి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. పదోతరగతి మార్కులకు 10 శాతం, ఇంటర్/పన్నెండో తరగతి మార్కులకు 10 శాతం, డిగ్రీ మార్కులకు 30 శాతం, రాత పరీక్ష స్కోరుకు 30 శాతం, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 10
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్
- **ఐఐపీ సెట్ 2024 తేదీ:** జూలై 14
- **ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూలై 16
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూలై 18, 19
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 22
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 29
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **వెబ్‌సైట్:** www.iip-in.com

నవ్య | చిత్రజ్యోతి

టికెట్ ధరల పెంపుపై సీఎంతో పవన్ చర్చిస్తానన్నారు

- సి. అశ్వనీదత్



కొత్త సినిమాలు విడుదలైన ప్రతిసారీ టికెట్ ధర పెంచాలని ప్రభుత్వాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా శాశ్వత ప్రాతిపదికన ఓ విధానం తీసుకురావాలనేదే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభిమతమని నిర్మాత సి. అశ్వనీదత్ అన్నారు. టికెట్ ధరల పెంపు అంశం గురించి ఇటీవల ఆయన ఓ ఇంటర్వ్యూలో వెలిబుచ్చిన అభిప్రాయాలపై కొన్ని అపోహలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సోషల్ మీడియా వేదికగా వాటిపై అశ్వనీదత్ స్పష్టతనిచ్చారు. 'బడ్జెట్‌ను బట్టి టికెట్ ధరలు ఎంతవరకూ పెంచవచ్చు, అలాగే ధరల పెంపు పది రోజులా?, వారమా? అనేది నిర్మాతలంతా కూర్చొని, చర్చించుకొని వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారితో స్వయంగా చర్చిస్తానని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు' అని తెలిపారు. నిర్మాతలకు అండగా ఉంటానని ప్రేక్షకులకూ, పరిశ్రమ వర్గాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని కలసికట్టుగా తీసుకుందాం అని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారని అశ్వనీదత్ ప్రకటనలో తెలిపారు.

పుట్టిన రోజు.. రెండు అప్‌డేట్స్



నందమూరి కల్యాణ్‌రామ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన నటిస్తున్న 21వ చిత్రం లుక్ పోస్టర్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. తన పిడికిలి బిగించి ఫైర్‌తో, కుర్చీలో కూర్చున్న కల్యాణ్‌రామ్ తన చుట్టూ ఉన్న గూండాలని ఇంటెన్స్‌గా చూస్తున్నట్లు పోస్టర్ పవర్‌ఫుల్‌గా ప్రజెంట్ చేస్తోంది. ఈ సినిమాలో కల్యాణ్‌రామ్ కొన్ని డేర్ డెవిల్ స్టంట్స్ చేయనున్నారు. అలాగే ఫైర్ యాక్షన్ ఎపిసోడ్ ప్రధాన ఆకర్షణగా ఉంటుందని దర్శకుడు ప్రదీప్ చిలుకూరి చెప్పారు. సీనియర్ నటి విజయశాంతి పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

బింబిసారకు సీక్వెల్

అలాగే కల్యాణ్‌రామ్ పుట్టిన రోజు సందర్భంగానే 'బింబిసార 2' కాన్సెప్ట్ పోస్టర్ విడుదల చేశారు. కల్యాణ్‌రామ్ కెరీర్‌లోనే అత్యంత భారీ విజయాన్ని సొంతం చేసుకున్న 'బింబిసార' చిత్రానికి సీక్వెల్ ఉంటుందని మేకర్స్ ఎప్పుడో ప్రకటించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఆ చిత్రం వివరాలను వెల్లడించారు. బింబసార కంటే యుగాల ముందు త్రిగర్తల రాజ్యాన్ని ఏలిన లెజెండ్‌ను చూడడానికి సిద్ధంగా ఉండండి' అని శుక్రవారం అనౌన్స్ చేశారు. స్క్రీన్ మీద ఇప్పటిదాకా ఎవరూ చూడనటువంటి స్థాయిలో త్రిగర్తలను ప్రదర్శించడానికి సన్నాహాలు ప్రారంభించారు. ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థ నిర్మించే ఈ చిత్రానికి అనిల్ పాదూరి దర్శకుడు.

అన్నింటికీ సమాధానం పార్ట్-2లో ఉంటుంది



సినిమా సినిమాకు అంచెలంచెలుగా ఎదిగిన డైరెక్టర్లు కొందరైతే.. చేసిన కొన్ని సినిమాలతోనే అపారమైన ప్రతిభావంతులుగా గుర్తింపు తెచ్చుకున్న దర్శకులు కొంతమంది. ఆ రెండో కోవకు వస్తారు డైరెక్టర్ నాగ్ అశ్విన్. డైరెక్టర్‌గా తొలి ప్రాజెక్ట్ 'ఎవడే సుబ్రమణ్యమ్'తో సున్నితమైన ఎమోషన్స్ ఉన్న సినిమాలను బాగా హ్యాండిల్ చేయగలడని నిరూపించుకున్నారు. రెండో సినిమా 'మహానటి'తో మంచి అభిరుచి ఉన్న దర్శకుడిగా పేరు తెచ్చుకుని.. మూడవ సినిమాగా ఇండియాలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందిన 'కల్కి 2898 ఏ.డీ' సినిమాను తెరకెక్కించారు. సినిమాను దృశ్యకావ్యంలా మలచి.. విమర్శకుల చేత, ప్రేక్షకుల చేత ఔరా! అనిపించుకున్నారు నాగ్ అశ్విన్. సినిమా విడుదలైన అన్ని చోట్లా సూపర్ హిట్ టాక్‌తో దూసుకుపోతున్న సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో ముచ్చటించారు.

"ముందుగా ఇంతటి ఘనవిజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. మన పురాణాల్లో అద్భుతమైన కథలు ఉన్నాయి. పురాణాలకు కాసింత సృజనాత్మకత జోడించి ఈ సినిమాను తెరకెక్కిద్దామనుకున్నాను. 'మాయాబజార్' సినిమా ఈ ఆలోచనకు స్ఫూర్తి. మొదటగా ఈ సినిమాను ఒక భాగంగానే తెరకెక్కించాలనుకున్నా. షూటింగ్ కూడా ఆ విధంగానే సాగింది. కానీ కొన్ని షెడ్యూళ్ల షూటింగ్ తర్వాత.. ఇంత కాన్వాస్ ఉన్న కథను రెండు భాగాలుగా విడదీద్దాం అనే ఆలోచన వచ్చింది. పార్ట్-2కి సంబంధించి 20 రోజుల షూటింగ్ చేశాం. కథకు న్యాయం చేసే పాత్రల్ని వెతికే సమయంలో సినిమాలోని కీలక పాత్రలకు అమితాబ్, కమల్‌హాసన్, దీపిక పదుకునే వంటి స్టార్స్ అయితే కరెక్ట్ అని భావించి వారిని తీసుకున్నాం. ఈ సినిమాతో నాలుగున్నరేళ్ల చిత్రబృందం ప్రయాణం చేసింది. ఈ సమయంలో వారెన్నో సవాళ్లను దాటుకొని చిత్ర విజయానికి దోహదపడ్డారు. ప్రభాస్‌కు మొదటి నుంచి సినిమాపై అపార నమ్మకం ఉండేది. ఆయన ప్రోత్సాహమే కష్టసమయాల్లో నన్ను, నిర్మాతల్ని ముందుకు నడిపించింది. సినిమా చూసినవారందరూ అనేక ప్రశ్నలు అడుగుతున్నారు. వాటన్నింటికీ సమాధానం పార్ట్-2లో ఉంటుంది. 'కల్కి' అవతారంలో ఏ నటుడ్ని చూపిస్తాం తెలియడానికి మరింత సమయం ఉంది" అని చెప్పారు.

హాని చేయాలనే తలంపు లేదు

సమంత



టాలీవుడ్ అగ్ర కథానాయిక సమంత వివాదంలో చిక్కుకున్నారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఓ పోస్ట్ వైద్య వర్గాల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. గత వారం సమంత నెబ్యులైజర్‌ను ఉపయోగిస్తున్న ఫోటోను షేర్ చేసి, 'వైరల్ ఇన్ఫెక్షన్లు వచ్చినప్పుడు మందులకు బదులుగా హైడ్రోజన్ పెరాక్సైడ్, డిస్టిల్డ్ వాటర్ కలిపి పీల్చితే మేజిక్‌లాగా పనిచేస్తుంది' అని సూచించారు. అయితే ఈ విధానాన్ని కొంతమంది వైద్యులు సోషల్ మీడియాలో తప్పుపట్టారు. అప్పటికే దెబ్బ తిన్న ఊపిరి తిత్తులలోకి హైడ్రోజన్ పెరాక్సైడ్ ప్రవేశిస్తే, న్యుమోనియా సహా పలు వ్యాధులను కలగజేస్తుంది. కొన్నిసార్లు మరణానికి దారి తీస్తుందని హెచ్చరించారు. 'ఇంతకంటే బుద్ధి తక్కువ పని లేదు. సమంతకు ఆరోగ్యం, విజ్ఞానశాస్త్రం గురించి ఏమీ తెలియదు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నందుకు ఆమెను జైలుకు పంపాల'ని ఫిలిప్స్ అనే వైద్యుడు సమంతను ఘాటుగా విమర్శించారు. స్పందించాడు. తనపై విమర్శలు రావడంతో స్పందించిన సమంత, మర్యాదకరమైన భాష ఉపయోగించాలని ఆ డాక్టర్‌ను కోరారు. 'ఇవన్నీ నాకు వైద్యులు చెప్పిన సలహాలే , ఎవరికీ చెడు చేయాలనే తలంపు నాకు లేదు. నన్ను లక్ష్యంగా చేసుకునే బదులు, ఈ విధానాన్ని నాకు సూచించిన డాక్టర్‌తో మీరు చర్చ జరిపితే బావుండేద'న్నారు. సమంత వివరణపై శుక్రవారం డాక్టర్ ఫిలిప్స్ స్పందిస్తూ, బాధితురాలిగా చూపించుకునే ప్రయత్నం మానుకోని, నిజా నిజాలు తెలుసుకొనేందుకు ప్రయత్నం చేయాలని సమంతకు సూచించారు. మానిటైజేషన్ కోసమే కొంతమంది సెలబ్రిటీలు ఇలాంటివి చేస్తున్నారని, వారికి ప్రజల ఆరోగ్యం పట్ల బాధ్యత లేదన్నారు.

రజనీ రాజసం



లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న చిత్రం 'కూలీ'. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ సాగుతోంది. నెల రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో పాల్గొనేందుకు రజనీకాంత్ ఇటీవలే హైదరాబాద్ చేరుకున్నారు. శుక్రవారం చిత్రీకరణ మొదలుపెట్టినట్లు నిర్మాణసంస్థ సన్ పిక్చర్స్ సోషల్ మీడియా ద్వారా తెలిపింది. దీంతో పాటు రజనీకాంత్ స్టైల్‌గా కుర్చీలో కూర్చొని రాజసం ఉట్టిపడే లుక్‌లో ఉన్న పోస్టర్‌ను షేర్ చేసింది. అనిరుధ్ రవిచంద్రన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

కూలీలో శ్రుతి ఖాయం

'కూలీ' చిత్రంలో శ్రుతీహాసన్ నటించబోతున్నారనే మాట కొన్నాళ్లుగా మీడియాలో వినిపిస్తోంది. కానీ చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా స్పందించలేదు. శుక్రవారం శ్రుతీహాసన్ ఈ సస్పెన్స్‌కు తెరదించారు. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో తన ఫొటోను పోస్ట్ చేసిన శ్రుతీ 'కూలీ డే 1 షూటింగ్' అని రాసుకొచ్చారు. దీంతో ఈ చిత్రంలో ఆమె నటించడం ఖాయమైనట్లే.

అడవిలో అందాల భామ



తమిళ హీరో ధనుష్, టాలీవుడ్ మన్మథుడు నాగార్జున కలయికలో తెరకెక్కుతోన్న మల్టీస్టారర్ 'కుబేర'. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోంది. రష్మిక మందన్న కథానాయిక. శుక్రవారం చిత్రబృందం రష్మిక ఫస్ట్ లుక్, క్యారెక్టర్ ఇంట్రడక్షన్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఫస్ట్ లుక్‌లో రాత్రిపూట డబ్బుతో ఉన్న ట్రాలీ బ్యాగ్‌తో అడవిలో నడుచుకుంటూ వెళ్తున్న రష్మిక లుక్ ఆసక్తికరంగా ఉంది. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PZmAgAJ లో చదవండి.

పవర్‌ఫుల్ పెదకాపు



హాస్య నటుడు అలీ కుటుంబానికి చెందిన సదన్ హీరోగా పరిచయమవుతున్న 'ప్రణయ గోదారి' చిత్రంలో పెదకాపుగా ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు సాయికుమార్. ఆయన లుక్‌కు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర శాసన సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విడుదల చేశారు. తమ మునుగోడు ప్రాంతానికి చెందిన పారుమళ్ల లింగయ్య నిర్మిస్తున్న 'ప్రణయగోదారి' విజయం సాధించాలని రాజగోపాల్‌రెడ్డి కోరుకున్నారు. 'ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. అన్నివర్గాల వారినీ అలరించే అంశాలు చిత్రంలో ఉన్నాయి. గోదారి అందాలు, అక్కడి ప్రజల జీవన విధానాలు ప్రేక్షకులను అలరిస్తాయి. అతి త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పారు నిర్మాత పారుమళ్ల లింగయ్య. పి.ఎల్.విఘ్నేశ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

అల్ఫా గర్ల్



యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో ఫస్ట్ ఫిమేల్ లీడ్‌గా అలియా భట్ అరుదైన ఘనత పొందారు. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'అల్ఫా' అనే పేరు పెట్టారు. ఈ టైటిల్‌కు మగవారు మాత్రమే కాదు మహిళలు కూడా అర్హులే అని సమాజానికి గట్టిగా చాటి చెప్పాలనే ధ్యేయంతో ఈ టైటిల్ నిర్ణయించినట్లు ఆదిత్య చోప్రా చెప్పారు. ఇందులో శార్వరి మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మించిన 'రైల్వే మెన్' చిత్రానికి దర్శకత్వం వహించిన శివ్ రవైల్ ఈ సినిమాకు దర్శకుడు.

ఆడపిల్ల తిరగబడితే...



నటి లావణ్య ప్రధాన పాత్ర పోషిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'ఇజ్జత్'. పరువు హత్యల నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. ఉపేంద్ర ఎస్‌పీ దర్శకత్వంలో శ్రీను కందుల నిర్మిస్తున్నారు. శుక్రవారం దర్శకుడు సునీల్‌కుమార్ రెడ్డి 'ఇజ్జత్' టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ 'ఒక మధ్య తరగతి అమ్మాయి కథే 'ఇజ్జత్' చిత్రం. పరువు హత్యకు సిద్ధపడిన తల్లీతండ్రులకు ఎదురు తిరిగే ధైర్యవంతురాలిగా కథానాయిక కనిపిస్తుంది. ఒక ఆడపిల్ల తిరగబడితే ఎలా ఉంటుందో చెప్పే చిత్రమే మా 'ఇజ్జత్' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'గతంలో పరువు హత్యల మీద వచ్చిన చిత్రాలకు 'ఇజ్జత్' భిన్నంగా ఉంటుంది. కొత్త తరహా కథనంతో క్వాలిటీ విజువల్స్‌తో నిర్మిస్తున్నాం. ఫస్ట్ కాపీ సిద్ధమవుతోంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సురేశ్ బొబ్బిలి. సినిమాటోగ్రఫీ: వీఆర్‌కే నాయుడు.

విద్యావ్యవస్థను నాశనం చేసిన ఘనుడు జగనే

● బాబు పాలనలో సమూల మార్పులకు శ్రీకారం
● వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు



వేమూరులో విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జూలై 5: రాష్ట్రంలో విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిన ఘనత మాజీ సీఎం జగన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు విమర్శించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వేమూరులోని ఎన్టీఆర్ పురవేదిక వద్ద నియోజకవర్గంలోని విద్యార్థులకు విద్యాకిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆనందబాబు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి లోకేశ్ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. విద్యాకిట్లు, చెక్కీల పంపిణీల్లో జగన్ పాలనలో కమీషన్లు దండుకున్నారని, ఉపాధ్యాయులను వైన్స్‌షాపుల వద్ద కాపాలాకాయించి విలువలను దిగజార్చారన్నారు. కూటమి ప్రభుత్వంలో మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి తొలి సంతకం చేశారని, తల్లికి వందనం పేరున కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటున్నా అంతమందికి రూ.15వేల చొప్పున సాయం అందిస్తామన్నారు. స్కాలర్‌షిప్‌లను తల్లికి వందనం పేరున విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల పరిధిలోని 12వేల మంది విద్యార్థులకు విద్యాకిట్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు దండే వెంకట సుబ్బారావు, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, ఐదు మండలాల తహసీల్దార్లు, ఎంఈవోలు, ఎంపీడీవోలు, హెచ్‌ఎంలు, అధికారులు హాజరయ్యారు.

ప్రజాదర్బార్‌లో రాష్ట్రవ్యాప్త వినతులు

● సరికొత్త సాంప్రదాయానికి యువనేత లోకేశ్ నాంది
● భారీగా తరలివస్తున్న ప్రజలు ● 12వ రోజుకు చేరుకున్న ప్రజాదర్బార్

లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న గాయపడిన వ్యక్తి, లోకేశ్‌కు వినతిపత్రాలు అందించేందుకు విచ్చేసిన దివ్యాంగులు







ప్రజాదర్బార్‌కు కరకట్టపై బారులు తీరిన అర్జీదారులు

తాడేపల్లి, జూలై 5: కష్టాల్లో ఉన్న ప్రజలకు నేనున్నానని భరోసా ఇస్తూ లోకేశ్ సరికొత్త సాంప్రదయానికి వేదికగా ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్‌లో ప్రజలనుండి వస్తున్న వినతులు స్వీకరిస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గం నుంచే కాకుండా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుండి భారీగా ప్రజలు విచ్చేసి తమ సమస్యలు అర్జీల రూపంలో విన్నవిస్తున్నారు. పెన్షన్ కోసం వృద్ధులు, వికలాంగులు, మహిళలు ఉద్యోగాల కోసం, సమస్యల పరిష్కారం కోసం వివిధ విభాగాల ఉద్యోగులు, విద్య, వైద్యసాయం కోసం సామాన్యులు, కష్టాల నుండి గట్టెక్కేందుకు బాధితులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. వారి సమస్యలు విన్న లోకేశ్ ఆయా శాఖలకు వినతిపత్రాలు పంపిస్తున్నారు.

గంజాయి మత్తులో దాడులకు పాల్పడుతున్నారు...

తాడేపల్లి పట్టణం సీతానగరం గోరాకాలనీకి చెందిన పలువురు యువకులు గంజాయి మత్తులో దాడులకు పాల్పడుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారిపై తగినచర్యలు తీసుకోవాలని బాధితులు కే అంజనేయప్రసాద్, మాచర్ల అఖిల్ మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తిచేశారు. స్థానికంగా ఉండే కట్టా భరత్ గంజాయి మత్తులో కత్తితో దాడిచేయగా తాను తీవ్రంగా గాయపడ్డానని, ఇరుగుపొరుగు వారు ప్రాణాలు రక్షించారని వివరించారు. తన సెల్‌ఫోన్, నగదు భరత్ లాక్కున్నాడని, తల్లిదండ్రులను హతమారుస్తానని బెదిరించాడని వాపోయాడు. పోలీసులకు ఫిర్యాదుచేసినా స్పందనలేదన్నారు. గంజాయి బ్యాచ్‌నుంచి తనకు భద్రత కల్పించాలని కోరాడు. గంజాయిబ్యాచ్ ఆగడాలు అరికడతామని లోకేశ్ హామీ ఇచ్చారు.

దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయాలి

మంచానికే పరిమితమైన తన కుమార్తెకు దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయాలని గుంటుపల్లికి చెందిన వెలమాటి శ్రీనివాసకుమార్ కోరారు. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్‌లో పనిచేస్తున్న బోధనా, బోధనేతర సిబ్బందికి మినిమం టైమ్‌స్కేల్ వర్తింపజేయాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు. విద్యుత్ బిల్లుల కారణంగా గత ప్రభుత్వం తొలగించిన రేషన్‌కార్డు, పెన్షన్ పునరుద్ధరించాలని మంగళగిరికి చెందిన వీ వీరభద్రరావు, లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్నానని, తన ఇద్దరు పిల్లల చదువు భారంగా మారిందని, ఆర్థికసాయం చేయాలని ఉండవల్లికి చెందిన వై దుర్గ కోరారు. డిగ్రీ చదివిన తనకు ఉద్యోగం లేక కుటుంబపోషణ భారంగా మారిందని ఏదైనా ఉద్యోగం కల్పించాలని విజయవాడకు చెందిన మడక రమ్య విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు.

నేడు, రేపు ప్రజాదర్బార్‌కు సెలవు

శని, ఆదివారాలు ప్రజాదర్బార్ కార్యక్రమం ఉండదని తదుపరి ప్రజాదర్బార్ తేదీని ప్రకటిస్తామని లోకేశ్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. అర్జీదారులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయంపై నిఘా

● ఉమ్మడి జిల్లాకు వచ్చిన ప్రత్యేక బృందాలు
● విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల కంపెనీల్లో తనిఖీలు
● మొదటి రోజే రూ.28లక్షలు విలువైన విత్తనాల పట్టివేత

గుంటూరు సిటీ, జూలై 5: గాడితప్పిన వ్యవసాయరంగాన్ని పటిష్ఠపరిచేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. నకిలీ విత్తనాలు, పురుగు మందులను నివారించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఆయా జిల్లాల నుండి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఇతర ప్రాంతాల నుండి తనిఖీ బృందాలు శుక్రవారం చేరుకున్నాయి. సుమారు ఐదు రోజుల పాటు ఈ బృందాలు జిల్లాలోని విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల కంపెనీలు, షాపుల్లో తనిఖీలు నిర్వహించనున్నాయి. ఈ బృందంలో వ్యవసాయశాఖ అధికారులతో పాటు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉంటారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో వేర్వేరు టీమ్‌లుగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పక్క జిల్లాల నుండి వచ్చిన నిఘా అధికారులు రెండు బృందాలుగా విడిపోయి దాడులు నిర్వహిస్తున్నారు.



గుంటూరులో పత్తి, మిరప విత్తనాలను స్వాధీనం చేసుకున్న ప్రత్యేక తనిఖీ బృందాలు

మొదటి రోజే...

ఉమ్మడి జిల్లాకు విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు ఎక్కువ శాతం గుంటూరు నుంచే సరఫరా అవుతున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు జిల్లా వ్యవసాయ అధికారి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నుండి ఇద్దరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లను, ఇద్దరు ఏడీఏలను, ముగ్గురు ఏఓలతో తనిఖీ బృందాలను ఏర్పాటు చేసింది. శుక్రవారం నగరంలోని ఆరు యూనిట్లలో తనిఖీలు నిర్వహించిన ప్రత్యేక బృందాలు భారీ మొత్తంలో అక్రమాలను గుర్తించారు. సరైన అనుమతి పత్రాలు లేకుండా అమ్మకాలకు సిద్ధం చేసిన రూ.28.31లక్షల విలువైన పత్తి, మిర్చివిత్తనాల అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు. నగర పరిధిలోని ఆటోనగర్ తదితర ప్రాంతాల్లోని విత్తనాలు, పురుగుమందుల కంపెనీల్లో ఈ తనిఖీలు కొనసాగాయి. స్టాక్ రిజిస్టర్లు, నిల్వలు, స్టాక్‌బోర్డులు తదితర రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కూడా ఇదే రీతిలో తనిఖీలు జరిగాయి.

వ్యాపార వర్గాల్లో కలకలం..

ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక తనిఖీలతో వ్యాపారవర్గాల్లో కలకలం రేగింది. ఇతర జిల్లాలకు చెందిన విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగటంతో వ్యాపారుల్లో ఆందోళన మొదలైంది. మొదటి రోజు తనిఖీలలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, విజిలెన్స్ సీఐలు శ్రీనివాసరెడ్డి, మాణిక్యరావు, ఏడీఏ నాగేశ్వరరావు, ఏఓ లు ఖడ్గం రమణకుమార్, బి.గౌతమ్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు-కంటైనర్ లారీ ఢీ

ఆర్టీసీ డ్రైవర్ మృతి




చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో డ్రైవర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఆర్టీసీ నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఆదాం సాహెబ్ తదితరులు

చిలకలూరిపేట, జూలై 5: జాతీయ రహదారిపై పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట శుక్రవారం ఆర్టీసీ బస్సు, కంటైనర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందారు. నరసరావుపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బస్టాండు నుంచి బయలుదేరి చీరాలకు వెళ్తుండగా గుంటూరు వైపునుంచి వస్తున్న కంటైనర్ లారీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసరావుపేట డిపో డ్రైవర్ షేక్ మస్తాన్‌వలి(50) మృతి చెందారు. బస్సులో ఉన్న నలుగురు ప్రయాణీకులు స్వల్పంగా గాయపడ్డారు. డ్రైవర్ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం జరిపిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా ఆర్టీసీ నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఆదాం సాహెబ్, నరసరావుపేట డీపీటీవో శ్రీనివాసరావు, నరసరావుపేట, చిలకలూరిపేట డిపో మేనేజర్లు బత్తుల వీరాస్వామి, ఎస్ రాంబాబు, గుంటూరు డిప్యూటీ సీఎంఈ నర్రా శ్రీనివాసరావు తదితరులు ప్రభుత్వ ఆస్పత్రిలో డ్రైవర్ మృతదేహాన్ని పరిశీలించారు. క్షతగాత్రులను పరామర్శించారు. డ్రైవర్ కుటుంబసభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ 25వేలు అందజేశారు. క్షతగాత్రులకు ప్రాథమిక సాయంగా రూ.2వేల చొప్పున అందించారు.

నేరం ఎవరు చేసినా చట్టం ఒక్కటే..

● టీడీపీ వాళ్లు దాడులు చేసినా కేసులు పెట్టండి
● గురజాల ఎమ్మెల్యే యరపతినేని సంచలన ఆదేశాలు
● వైసీపీ వాళ్లు ఊర్లు వదిలి వెళ్లొద్దని హితవు
● వైరల్‌గా మారిన గురజాల ఎమ్మెల్యే యరపతినేని వీడియో



పిడుగురాళ్ల, జూలై 5: 'నాకు ప్రశాంతమైన పల్నాడు కావాలి. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దుర్మార్గం చాలు. మళ్లీ అటువంటి ఉదంతాలు జరగడానికి వీల్లేదు. నేను పోలీసులకు చెప్పేది ఒకటే. టీడీపీ వాళ్లు దాడులకు పాల్పడినా కేసులు పెట్టండి. తప్పు ఎవరిదైతే వారిని శిక్షించండి. వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు ఒకటే చెబుతున్నా.. ఎవ్వరూ ఊర్లు వదిలివెళ్లొద్దు. హాయిగా మీ భార్యాపిల్లలతో కలిసి జీవించండి. మీ వ్యవసాయం, వ్యాపారాలు మీరు చేసుకోండి. మీ పనులు మీరు చక్కదిద్దుకోండి. నేను ఎవరిని ఇబ్బంది పెట్టను. ఒకవేళ మావాళ్లు ఎవరైనా మిమ్మల్ని ఇబ్బంది పెడితే, మీరే నాకు నేరుగా ఫోన్‌చేయండి'అంటూ గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రెండు రోజుల క్రితం గురజాల నియోజకవర్గ సమీక్షలో నేతలతో అన్న మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. తక్కువ సమయంలో సుమారు కోటిమందికి పైగా ఆ వీడియో వీక్షించడం హాట్‌టాపిక్ అయింది. గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గురజాల నియోజకవర్గం నుండి వేలాది టీడీపీ కుటుంబాలు ఉన్నపాటున ఊర్లు వదిలి వెళ్లిపోయాయి తలదాచుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ పరిస్థితిని మార్చాలన్న సదుద్దేశంతో ఎమ్మెల్యే యరపతినేని చేసిన వ్యాఖ్యలపై వైసీపీ శ్రేణులు సైతం ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఉన్న ఊరు విడిచి ఎవరూ వెళ్లొద్దని ప్రత్యర్థి పార్టీ శ్రేణులకు ఆయన ఇచ్చిన భరోసా రాజకీయంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది.

దివ్యాంగురాలిపై వైసీపీ కక్షపూరిత రాజకీయం

● టీడీపీ సానుభూతిపరులని పింఛన్ నిలిపివేత
● ఆదుకోవాలంటూ పాప తల్లిదండ్రుల విజ్ఞప్తి





మానస, ఆమె సదరన్ సర్టిఫికెట్

దుర్గి, జూలై 5: 'కులం చూడం.. మతం చూడం.. ప్రాంతం చూడం.. రాజకీయం చేయం.. ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందించడమే వైసీపీ లక్ష్యమంటూ ప్రతి సభలో ఊకదంపుడు ఉపన్యాసాలతో ఊగిపోయే వైసీపీ నాయకులు చేతల్లో మాత్రం పూర్తిగా విరుద్ధంగా వ్యవహరించారు. మండలంలోని తేరాలకు చెందిన పదేళ్ల అంకిపల్లి మానస పుట్టుకతోనే మానసిక దివ్యాంగురాలు. పుట్టిన నాటి నుంచి నేటి వరకు కూడా మంచం మీద నుంచి కదల్లేని పరిస్థితి. ప్రభుత్వ వైద్యులు 90 శాతం వికలాంగురాలంటూ సదరన్ సర్టిఫికెట్ ఇచ్చినప్పటికీ పాప తండ్రి వీరయ్య టీడీపీ సానుభూతిపరుడనే ఉద్దేశంతో పింఛన్‌ను ఆపివేసి వైసీపీ నాయకులు కక్షపూరిత రాజకీయం చేసి రాక్షస ఆనందం పొందారు. ఐదేళ్లుగా వారు తిరగని కార్యాలయం లేదు.. కలవని నాయకుడు లేడు.. గతంలో కలెక్టర్ శివశంకర్ దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేకుండాపోయింది. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద నిరుపేద కుటుంబం. మానస బాగోగులు చూసుకోవడానికి తల్లి ఇంటికి పరిమితం కాగా వీరయ్య కూలీనాలీ చేస్తూ కుటుంబం పోషిస్తున్నాడు. ఊర్లో సెంటు భూమి కూడా లేని వీరయ్య కుటుంబంపై వైసీపీ నేతలు కక్ష సాధింపు దుర్మార్గమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మానస బాగోగులకు నెలకు రూ. 10 వేలు దాకా ఖర్చవుతుందని, పింఛన్ వస్తే మందులకు కొంత ఊరట లభిస్తుంది. అయితే వైసీపీ నేతలు పింఛన్ రాకుండా చేయడంతో తమ కుటుంబం ఇబ్బంది పడుతోందన్నారు. ఇకనైనా మానస కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బైక్ దొంగల అరెస్టు

● రూ.15లక్షల విలువైన 11 బైకుల స్వాధీనం



నిందితులను చూపుతూ వివరాలు తెలుపుతున్న డీఎస్పీ రమేష్‌బాబు

చేబ్రోలు, జూలై 5: వేర్వేరు చోట్ల బైకులు దొంగతనం చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రమేష్‌బాబు చెప్పారు. శుక్రవారం చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో నిందితులను చూపుతూ డీఎస్పీ రమేష్‌బాబు వివరాలు వెల్లడించారు. గత నెలలో చేబ్రోలు మండలం నారాకోడూరులో ఇళ్ల వద్ద పార్కింగ్ చేసిన బైకులను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని అదే గ్రామానికి చెందిన వడ్లమూడి నిషిత్ ప్రసాద్, వెలగ దీపిక, వెలగ సాయినాథ్‌లు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేశారు. దీనిపై సీఐ వై.కోటేశ్వరరావు, ఎస్ఐ మహేష్‌బాబు రెండు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలించారు. ఇదే క్రమంలో శుక్రవారం నారాకోడూరు సెంటర్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న గుంటూరుకు చెందిన రెడ్డినాగభానుప్రకాష్, షేక్ ఇమ్రాన్‌బాషా, మునిపల్లి మధురాజేష్, పేరేచర్ల శాంతికుమార్, షేక్ షఫీ, రెంటిచింతలకు చెందిన జక్కంపూడి గోపిరెడ్డిలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిని విచారించగా చేబ్రోలు మండలంలోనే కాకుంగా మంగళగిరిటౌన్, తాడేపల్లి, నాదెండ్ల, చిలకలూరిపేట టౌన్, పెదనందిపాడు, మాచవరం(విజయవాడ) పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 11 ద్విచక్రవాహనాలను దొంగిలించినట్లు చెప్పారన్నారు. వారినుండి రూ.15లక్షల విలువైన 11 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. కేసును త్వరితగతిన చేదించిన పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ పి.మహేష్‌కుమార్, స్టేషన్ సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

డెల్టా రైలుకు వేమూరు, పిడుగురాళ్లలో నిలుపుదల కల్పించాలి

● దక్షిణ మధ్య రైల్వే డీజీఎంకు జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుల విజ్ఞప్తి

గుంటూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రేపల్లె - సికింద్రాబాద్ డెల్టా ఎక్స్‌ప్రెస్‌కి ప్రయాణికుల సౌకర్యార్థం గతంలో వలే వేమూరు, పిడుగురాళ్ల స్టేషన్‌లలో నిలుపుదల చేయాలని దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సంప్రదింపుల కమిటీ సభ్యులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్, మద్దాల సుబ్బయ్యలు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఏ శ్రీధర్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సికింద్రాబాద్ రైలు నిలయంలోని ఆయన కార్యాలయంలో వరప్రసాద్ యాదవ్, సభ్యులు కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. తాము గత 75వ జెడ్‌ఆర్‌యుసిసి సమావేశంలోపై సమస్యలను రైల్వే జీఎం దృష్టికి తీసుకువచ్చామన్నారు. తమ ప్రాంతాల ప్రజాప్రతినిధులు, పార్లమెంట్ సభ్యులు సైతం ఈ సమస్యలు రైల్వే మంత్రికి, రైల్వే బోర్డ్ చైర్మన్‌కి విజ్ఞప్తి చేసినప్పటికీ నేటి వరకు ఈ ప్రాంతాల్లో డెల్టా రైలుని నిలుపుదల చేయకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి, అసహనానికి గురవుతున్నారని చెప్పారు. అలాగే దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని అన్ని డివిజన్లనో ఆర్పీఎఫ్ సిబ్బందిని పెంచేందుకు తక్షణం నియామకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ మేనేజర్ ఠాకూర్‌ని కలిసి వరప్రసాద్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. గుంటూరు విజయవాడ డివిజన్ల ముఖ్య స్టేషన్ల వద్ద గంజాయి అమ్మకం, అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోయాయని వాటిని నియంత్రించేందుకు సరిపడా సిబ్బంది లేరన్నారు. గుంటూరు నగరంలోని ట్రాఫిక్ ను అధిగమించేందుకు గుంటూరు అరండల్‌పేట ఆర్వోబీ విస్తరణకు యుద్ధ ప్రాతిపదికపై చర్యలు తీసుకోవాలని, శ్యామలనగర్, నెహ్రూనగర్, గడ్డిపాడుల వద్ద ఆర్వోబీ, ఆర్‌యుబీల నిర్మాణానికి డీపీఆర్‌లను వెంటనే సిద్ధం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని డీజీఎంకి విజ్ఞప్తి చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

వేధింపుల కేసులో హైకోర్టు న్యాయవాదికి
మూడేళ్ళ జైలు, రూ.10వేల జరిమానా

మంగళగిరి, జులై 5: భార్యను మానసికంగా, శారీరకంగా వేధించిన కేసులో హైకోర్టు న్యాయవాదికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్‌వీ రామకృష్ణ శుక్రవారం తీర్పు చెప్పారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్ నాగమణి కథనం ప్రకారం.. ఫిర్యాది అనంతపురానికి చెందిన దేవాంగ ప్రశాంతికి అనంతపురానికి చెందిన నిమ్మల ప్రేమరాజ్‌తో 2002లో వివాహం జరిగింది. వీరికి పాప, బాబు సంతానం. ప్రశాంతి తొలుత హిందూపూర్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి తదుపరి ఏపీ సచివాలయంలో 2005నుండి ప్రస్తుతం వెలగపూడి సచివాల యంలో ఆర్థిక శాఖలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. అనంతరం రాష్ట్రం విడిపోయాక తాడేపల్లి మండలం కుంచనపల్లి విచ్చేసి నివాసం ఉంటున్నారు. ఆమెను భర్త ప్రేమరాజ్ నిత్యం మానసికంగా, శారీరకంగా వేధిస్తూ ఇబ్బందులపాలు చేస్తున్నాడని ప్రాణభయం ఉందని ఆరోపిస్తూ 2016లో గుంటూరు నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. దీంతో ఎస్ఐ సుబ్బారావు క్రైమ్ నెం.142/2018 అండర్ సెక్షన్ 498ఎ 506 ఐపీసీ కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. ఈ కేసు ఇటీవల మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో విచారణకు రాగా వాదోపవాదాల అనంతరం ఫిర్యాది భర్త, న్యాయవాది ప్రేమరాజ్‌కు మూడేళ్ళ కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి రామకృష్ణ తీర్పు చెప్పారు. డీఎస్పీ రమేష్ కుమార్ చార్జిషీటు ఫైల్ చేశారు. ఏపీపీ ఎన్ నాగమణి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

29,712 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 23,582 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 29,712 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 11,289 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16000	334	10000	13000
నెంబరు. 5	11000	15700	నెంబరు.5	9000	10500
273	10000	14200	341	9000	14000
341	8300	16500	4884	12000	12000
4884	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	19700	తేజ	9000	19500
బ్యాడిగి	8500	16000	బ్యాడిగి	9100	13700
దేవనూరుడీలక్స్	10500	13000	దేవనూరుడీలక్స్	11000	13800
తెల్లకాయలు	5000	12500	తెల్లకాయలు	5000	11500

పల్నాడు వార్తలు

ఉచిత ఇసుక హామీ అభినందనీయం

● సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూలై 5 : ఎన్నికల ముందు నారా చంద్రబాబునాయుడు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తూ నిర్ణయం తీసుకోవటం అభినందనీయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇక పేదలకు కారు చౌకగా ఇసుక లభ్యం కానుందన్నారు. కేవలం రవాణా, లోడింగ్, లేబర్ చార్జీలతో ఇసుక పేదల దరి చేరనుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించి భవన నిర్మాణ కార్మికులను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. దీంతో నిర్మాణ రంగంతో పాటు అనుబంధ రంగాలు కునారిల్లాయన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక పస్తులు గడిపారన్నారు. ఈనెల 8 నుంచి ఉచిత ఇసుక పాలసీని ప్రభుత్వం అమలు చేయనుందని తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రజలకు ఇక ఇసుక కష్టాలు తీరుతాయని, భవన నిర్మాణ కార్మికులకు, సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు.

ప్రజలకు మాజీ సీఎం జగన్ క్షమాపణ చెప్పాలి

మాచర్ల రూరల్, జూలై 5: మాజీ సీఎం జగన్ చేసిన తప్పులకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్‌రెడ్డి నెల్లూరులో చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా, అహంకారంగా ఉన్నాయన్నారు. ఐదేళ్ల పాటు చేసిన తప్పుడు నిర్ణయాలను సమర్థించుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. మూడు రాజధానులు, మద్యం, ఇసుక విధానాలు, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో అన్ని వర్గాలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. సమావేశంలో ఆయన వెంట కొమ్ము కోటేశ్వరరావు, షేక్ షకీర్ అలీ తదితరులు ఉన్నారు.

డెల్టా రైలుకి పిడుగురాళ్లలో స్టాప్ ఇవ్వాలి

పిడుగురాళ్ల, జూలై 5: రేపల్లె డెల్టా ట్రైన్‌కు పిడుగురాళ్ల, వేమూరు రైల్వే స్టేషన్‌లలో స్టాపింగ్ పాయింట్ ఇచ్చేలా చూడాలని సౌత్‌సెంట్రల్ డీజీఎంకు జడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు మద్దాళి సుబ్బయ్య, అంగిరేకుల వరప్రసాద్ యాదవ్‌లు శుక్రవారం సికింద్రాబాద్‌లో దక్షణ మధ్య రైల్వే డిప్యూటీ జనరల్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కొవిడ్ సమయం నుండి ఆగిపోయిన పలు రైళ్లను పిడుగురాళ్ల స్టేషన్‌లో నిలుపుదల చేయాలని వారు కోరారు.

విధులకు న్యాయవాదుల గైర్హాజరు

గురజాల లీగల్, జూలై 5: గుంటూరు జిల్లా న్యాయవాదుల ఫెడరేషన్ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక న్యాయవాదులు తమ విధులకు గైర్హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన నూతన చట్టాలను రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు చల్లా రామిరెడ్డి, కరణం కాశీవిశ్వనాథం, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాసరెడ్డి, కేవీ.నాగార్జున, కలివెల ప్రభుదాసు, డీ.అనంత రామయ్య, బీఎస్వీ హనుమంతరావు, ఆదినారాయణ, హరిసత్యనారాయణ, ఎస్‌కె జానీబాష, చెన్నకేశవరావు, శ్రావణ్‌కుమార్, సీహెచ్ కోటేశ్వరరావు, కె కోటేశ్వరరావు, చలమరాజు, లింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జీవాల నుంచి వచ్చే వ్యాధులపై అప్రమత్తం

క్రోసూరు, జూలై 5 : పశువుల్ల, జీవాల కాపర్లు ఈ సీజన్‌లో వాటి నుంచి వ్యాప్తి చెందే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ మల్లయ్య హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని విప్పర్ల, 88 తాళ్ళూరు గ్రామాల్లో తెల్లజాతి పశువులకు, గొర్రెలకు, నీలి నాలుక వ్యాధి టీకాలు, పొడవ్యాధి టీకాలను ఆయన పంపిణీ చేశారు. శనివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా మండలంలోని కుక్కలన్నింటికీ ఉచిత ర్యాబీస్ వ్యాధి నిరోదక టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు క్రోసూరు, దొడ్లేరు పశు వైద్యశాలలో వారి కుక్కలకు యాంటీ ర్యాబీస్ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి డాక్టర్ మల్లయ్య సూచించారు.

ఆ పాపం వైసీపీదే..

● డైట్ చార్జీలు చెల్లించకుంటే విద్యార్థుల ఆకలి తీరేదెలా ?

● అప్పు చేసి విద్యార్థుల ఆకలి తీర్చి అప్పుల పాలైన వార్డెన్లు

● గత ప్రభుత్వ నిర్వాకంతోనే నేడు ఈ దుస్థితి

● ఆంధ్రజ్యోతి కథనంపై స్పందించిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల,జూలై 5 : 'నా ఎస్సీ, బీసీ, ఎస్టీ అంటూ ఉపన్యాసాలతో ఊదరగొట్టిన మాజీ సీఎం జగన్ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులను ఆకలి పాల్జేశాడు. అదిచూసి సహించలేని వార్డెన్లు పలువురు అక్కడా ఇక్కడా అప్పులు చేసి విద్యార్థుల ఆకలి తీర్చారు. నెలవారీ డైట్ బిల్లులు విడుదల చేయకపోవడం వలన వార్డెన్లు అప్పులు చేసి విద్యా ర్థుల ఆకలి తీర్చాల్సి వచ్చింది. ఈ పాపం ముమ్మాటికీ గత వైసీపీ పాలకులదే' అంటూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం గుంటూరు నుంచి మాచర్ల వెళ్తున్న ఆయన రెంటచింతల ఎంపీడీవో ఆఫీసు సమీపంలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. 'ఐదు నెలలుగా అందని డైట్ బిల్లులు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఎమ్మెల్యే స్పందిస్తూ.. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం వలన వార్డెన్లు పడుతున్న ఇబ్బందులు ఆలోచింప చేసేవిగా వున్నాయన్నారు. బంగారం తాకట్టు పెట్టి అప్పులు చేసి చిన్నారులను పోషిస్తున్నారనే వార్త తన మనస్సును కలచివేసిందన్నారు. హాస్టళ్లలో ఉంటూ విద్యనభ్యసిస్తున్న నిరుపేదల విద్యార్థుల పట్ల జగన్ ప్రభుత్వానికి వున్న కపట ప్రేమ ప్రజలకు అర్థం గావడం వల్లే గడిచిన ఎన్నికల్లో శంకరగిరి మాణ్యాలకు పంపారని దుయ్యబట్టారు. కాస్మోటిక్ చార్జీలు కూడా ఇవ్వకుండా చింపిరి జుట్టుతో ఓ బాలిక పాఠశాలకు ఎలా వెళ్తుందని సూటిగా ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు పాలనలో అలాంటి ఇబ్బందులుండవని త్వరలో సమస్య పరిష్కారమవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంక్షేమ హాస్టళ్లు 1156 వుండగా 84829 మంది విద్యార్థులున్నారని, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లు 1074 ఉండగా 81,816 మంది, గిరిజన సంక్షేమ హాస్టళ్లు 629 ఉండగా 1,23,489 స్టూడెంట్స్ వున్నారన్నారు. వార్డెన్లు ఎదుర్కొంటున్న సమస్యను మంత్రులు సవితమ్మ, డోలా బాలవీరాంజనేయస్వామి దృష్టికితీసుకెళ్తానని ఎమ్మెల్యే అన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి, టౌన్ అధ్యక్షులు రాజారెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, శౌర్రెడ్డి, రాయపరెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేష్, వెంకట్రామిరెడి, సామ్యేల్ తదితరులున్నారు.

నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

అచ్చంపేట, జూలై 5 : నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని జరుపుతున్నట్లు అచ్చంపేట మండల పశు వైద్యాధికారి డాక్టర్ స్వాతిదేవి తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధులను జూనోసిస్ వ్యాధులంటారని ఆమె తెలిపారు. జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా అచ్చంపేట మండలంలో అన్ని పశు వైద్య కేంద్రాల్లో, రైతు సేవా కేంద్రాల్లోను ఉచితంగా యాంటీ రాబీస్ టీకాలు పెంపుడు కుక్కలకు వేస్తున్నట్టు తెలిపారు. మండలంలోని పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని ఆమె కోరారు.

జగన్.. దమ్ముంటే మాచర్లకు రా..



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

● నీ సుద్దపూస అక్రమాలు ఆధారాలతో చూపిస్తా...

● నీతో నీతులు చెప్పించుకునే స్థితిలో లేము

● అక్రమాలు చేస్తే విచారణ ఎదుర్కోవాల్సిందే..

● మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూలై 5: 'పులివెందుల ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రెడ్డి దమ్ముంటే మాచర్లకు రా.. వస్తే మీ సుద్ధపూస ఉంగరాల బ్రదర్స్, గుడుంబా శంకర్‌లు మాచర్లలో చెరబట్టిన అక్రమాలు, అన్యాయాలు ఆధారాలతో సహా చూపిస్తా..' అంటూ మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పులివెందుల ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రెడ్డికి సవాల్ విసిరారు. శుక్రవారం పట్టణంలోని నెహ్రూనగర్ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలపై దాడులు జరుగుతున్న సమయంలో సిక్కటి చిరునవ్వు చిందించిన జగన్‌మోహన్‌రెడ్డి తన దోపిడి ముఠాలో సభ్యుడికి, కబ్జా కోరుకు అన్యాయం జరిగిందంటూ బయటకు వచ్చి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. జగన్‌తో నీతులు చెప్పించుకునే స్థితిలో టీడీపీ నేతలు, కార్యకర్తలు లేరన్నారు. ప్రజలకు మంచి చేసినా తాము ఓడిపోయామని చెప్పడం జగన్ దివాలాకోరుతనానికి నిదర్శనమన్నారు. ఏ వర్గానికి న్యాయం చేశాడో చెప్పాలన్నారు. యువతను గంజాయికి బానిసను చేసి గంజాయి వ్యాపారం చేసి వైసీపీ నేతలు కోట్లు గడించారన్నారు. అమరావతిపై కక్ష కట్టి భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న అనేక మంది బడుగు, బలహీన వర్గాల వారి పొట్టగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తన స్వప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి దివాలా తీయించిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదే అన్నారు. రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల పాలుచేసి అగాదం సృష్టించారని విమర్శించారు. ప్రజాధనంతో నిర్మించిన ప్రజావేదికను కూల్చి సైకో ఆనందం పొందిన జగన్ మా పార్టీ ఆఫీసులను ధ్వంసం చేసి దాడులు చేసిన వారిపై కేసులు పెడితే నేటి వరకు చర్యలు లేవన్నారు. వీటిపై సమగ్ర విచారణ చేపడతామన్నారు. పాత కేసులన్నీ తిరగతోడతామని, వైసీపీ అవినీతి అక్రమాలకు, కబ్జాలకు తొత్తులుగా ఉన్న అధికారులు విచారణ ఎదుర్కొనక తప్పదన్నారు. జగన్ ఉడత ఊపులకు టీడీపీ భయపడదన్నారు. రాష్ట్ర ఖజానాను దోచుకున్న వారు ఏ స్థాయిలో ఉన్నా, ఎంతటి వారైనా వారికి సహకరించిన వారు సైతం జైలుకు వెళ్లక తప్పదన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాతులూరు కుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మున్నా రాంబాబు, కౌన్సిలర్ మదార్‌సాహెబ్, మద్దిగపు చిన వెంకట్రామిరెడ్డి, నేరేటి వీరాస్వామి, గూండాల శ్రీనివాస్ యాదవ్, యెనుముల కేశవరెడ్డి, యేచూరి సురేష్, మంజుల అంజి తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో ప్రబలిన డయేరియా

● శుక్రవారం 15 మంది ఆస్పత్రిపాలు

● వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల పర్యటన

● వైద్యాధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూలై5: పిడుగురాళ్ల పట్టణంలో డయేరియా ప్రభలుతోంది. సున్నంబట్టీల పరిసర ప్రాంతాలలో తాగు నీటి కాలుష్యంతో డయేరియా వ్యాప్తి చెందింది. రెండు రోజుల క్రితం అబుబాక సిద్దిక్ (9) అనే బాలుడు మృతిచెందాడు. దీంతో అప్రమత్తమైన మున్సిపల్, వైద్యాధికారులు ఆయా ప్రాంతాలలో పారిశుధ్య చర్యలకు ఉపక్రమించారు. అయినప్పటికీ శుక్రవారం 15 మంది వాంతులు, విరేచనాలతో లెనిన్‌నగర్, పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. డయేరియా మరింత ప్రబలకుండా అధికారులు ఆయా ప్రాంతాలలో యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. వైద్యాధికారులు అందుబాటులో వుండి వైద్యసేవలు అందించడంతో శుక్రవారం సాయంత్రానికి పరిస్థితి కొంత అదుపులోకి వచ్చింది.



లెనిన్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

స్పందించిన ఎమ్మెల్యే యరపతినేని..

లెనిన్‌నగర్, మారుతీనగర్ ప్రాంతాలలో డయేరియా ప్రబలిన విషయం తెలుసుకున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం వెంటనే స్పందించి మున్సిపల్, వైద్యాధికారులతో మాట్లాడారు. డయేరియాను అదుపుచేసేందుకు కావలసిన మందులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, పారిశుధ్య మెరుగుదలకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



లెనిన్‌నగర్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు

పరిసరాల శుభ్రతపై మున్సిపల్ అధికారుల తనిఖీ

లెనిన్‌నగర్, మారుతీనగర్ పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా వుంచాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ రవీంద్రబాబు ఆదేశించారు. లెనిన్‌నగర్ పరిసర ప్రాంతాలలో రెండు రోజులుగా డయేరియా ప్రబలడంతో కొందరు వైద్య చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి ఆయా ప్రాంతాలలో పారిశుధ్య మెరుగుకు తీసుకుంటున్న చర్యలను శుక్రవారం మున్సిపల్ ఆర్డీ పరిశీలించారు. డయేరియా రావడానికి గల కారణాలను తెలుసుకునేందుకు అధికారులను వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో నీటిశాంపిల్స్‌ను సేకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ రవీంద్రబాబు, కమిషనర్ గిరి కుమార్, ఏఈ రాఘవేంద్ర, పలువురు అధికారులు, పాల్గొన్నారు.

నేడు ఆలయ కౌలు భూములకు వేలం

మాచవరం, జూలై 5: మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న చిదంబర రామలింగేశ్వరస్వామి దేవాలయ భూముల కౌలువేలం శనివారం నిర్వహించనున్నట్లు దేవాలయ ఈవో పుణ్యాల వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేమవరంలోని చిదంబర రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం 10.30 గంటలకు వేలం ప్రారంభమవుతుందని, పాల్గొనదలచిన వారు ముందుగా డిపాజిట్ చెల్లించాలని వెంకటరెడ్డి సూచించారు.



జేసీకి అభినందనలు తెలుపుతున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

డయేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు

క్రోసూరు, జూలై 5 : డయేరియా వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల సందర్భంగా క్రోసూరు మండలంలోని 14 సబ్ సెంటరలో ఓపీ సేవలు ప్రారంభించినట్టు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శివుడు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా సబ్ సెంటర్లకు వచ్చే రోగులకు, పాఠశాలల విద్యార్థులకు డయేరియా వ్యాధి ప్రబల కుండా ముందు జాగ్రత్త చర్యలుగా రక్త పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. మండలంలోని అన్ని సబ్ సెంటర్లలో వైద్య ఆరోగ్య సిబ్బంది రక్త నమూనాలు సేకరించారన్నారు. సున్నా నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు నీళ్ళ విరోచనాల కేసులను పరీక్షించి తగిన వైద్య సహాయం అందించటమే కాక అవసరమైతే సంబంధిత వైద్యశాలలకు రిఫర్ చేయనున్నట్టు తెలిపారు. వివిధ గ్రామాల్లో జరిగిన రక్త పరీక్షల్లో ఏఎన్ఎంలు స్వరూపరాణి, రజిని, స్వప్న, పలువురు ఆషా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

అమరేశ్వరుని సన్నిధిలో జేసీ శ్యాంప్రసాద్

అమరావతి, జూలై 5: మన్యం జిల్లా కలెక్టర్‌గా బదలీపై వెళ్తున్న పల్నాడుజిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ శుక్రవారం అమరావతిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు శ్యాంప్రసాద్ పేరు మీద స్వామివార్లకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ధ్యానబుద్ధ ప్రాజెక్టును సందర్శించారు. స్థానిక తహసీల్దార్ వెంకటరమణారావు, ఆర్ఐ రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది కలెక్టర్‌గా బదలీపై వెళ్తున్న జేసీ శ్యాంప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు.

7న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

పెదకూరపాడు, జూలై 5: పెదకూరపాడులో కొమార బత్తిన రోజమ్మ కార్యంశెట్టి జయరావుల జ్ఞాపకార్ధం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు, విశ్రాంత ఉద్యోగి డాక్టర్ కార్యంశెట్టి లూర్దురాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పెదకూరపాడులోని ఆర్‌సీఎం ఎలిమెంటరీ పాఠశాల ప్రాంగణంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం, ఉబ్బసం, జీర్ణకోశ, చర్మవ్యాధిగ్రస్తులకు నిపుణులైన వైద్యులు డాక్టర్ కే.రత్తయ్య, డాక్టర్ బీ.వెంకటేశ్వర్లు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. వివరాలకు 9900087057, 94901 93101 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.



సత్తెనపల్లి కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదుల నిరసన

సత్తెనపల్లి, జూలై 5 : కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నూతన చట్టాలను నిరసిస్తూ సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాటిబండ్ల రవి ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు పలువురు విధులు బహిష్కరించి స్థానిక కోర్టు ప్రాంగణంలోని న్యాయ దేవత విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ విజయ కుమార్, బత్తిన శ్రీనివాస బాబు, పోతల రవి, బాల కోటయ్య, శేషయ్య నాగులు, కిషోర్, పూర్ణచంద్రరరావు, విద్యా సాగర్‌రెడ్డి, హరీష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

77బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

రాజుపాలెం, జూలై 5: గుటూంరు-మాచర్ల రహదారిపై మండలంలోని కోటనెమలిపురి గ్రామ బస్టాండ్ సెంటర్ వద్ద శుక్రవారం అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. వారికి అందిన ఖచ్చితమైన సమాచారం మేరకు రాజుపాలెం పోలీసులు, రెవెన్యూ అధికారులు కలిసి రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. అందులో 50 కేజీల పరిమాణంలో మొత్తం 77 రేషన్ బియ్యం బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. వాహనం డ్రైవర్ గంజిబోయిన వెంకట తిరుపతిరావును అదుపులోకి తీసుకొని వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించిన్నట్లు ఎస్ఐ షామీర్‌బాషా తెలిపారు.

పాడి రైతుల అభ్యున్నతి హెరిటేజ్ లక్ష్యం

● డెయిరీ రీజనల్ హెడ్ నాగ అప్పారావు

నకరికల్లు, జూలై 5: పాడి రైతులను అన్నివిధాలా అభివృద్ధి చేయటమే హెరిటేజ్ డెయిరీ లక్ష్యమని ఆ సంస్థ రీజనల్ హెడ్ నాగ అప్పారావు తెలిపారు. శుక్రవారం మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సులో నాగ అప్పారావు మాట్లాడుతూ హెరిటేజ్‌కు పాలు పంపే పాల ఉత్పత్తి దారులందరికీ రూ.2 లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నట్టు తెలిపారు. సబ్సిడీపై పశువుల దాణా అందిస్తున్నామన్నారు. గేదెలకు ఇన్సూరెన్స్ చేస్తున్నట్టు తెలిపారు. నాణ్యమైన పాల ఉత్పత్తి కోసం గేదెల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను, చర్యలను తెలియ జేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెరిటేజ్ డెయిరీ చల్లగుండ్ల మేనేజర్ పెంట్యాల సుధాకర్, సంతమాగులూరు మేనేజర్ శ్రీనివాసరావు, హెరిటేజ్ ఫైనలీజ్ అనూష, సూపర్‌వైజర్లు మధుసూదనరావు, పాల సేకరణ ప్రతినిధి దూడల కొండ, శ్రీనివాసరావు, కృష్ణ పాల్గొన్నారు.



గుండ్లపల్లిలో మాట్లాడుతున్న హెరిటేజ్ రీజనల్ హెడ్ నాగా అప్పారావు



క్రోసూరులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రవీణ్, టీడీపీ నేతలు

నియోజక వర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, జూలై 5 : పెదకూరపాడు నియోజక వర్గాన్ని రానున్న ఐదు సంవత్సరాల్లో అన్నివిధాలా అభివృద్ధి చేసి ఆదర్శయుతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని ఎర్రబాలెం, క్రోసూరు, ఊటుకూరు, ఉయ్యందన గ్రామాల్లో శుక్రవారం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. కనీవినీ ఎరుగని రీతిలో పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలు తనను ఆదరించి అక్కున చేర్చుకున్నారని, వారి రుణం తీర్చుకుంటానని అన్నారు. నియోజకవర్గంలో సాగు నీరు, తాగు నీరు, రోడ్ల నిర్మాణాలు, పాఠశాలల భవనాల నిర్మాణం, వైద్యశాలల నిర్మాణం మొదలైన వాటితో పాటు ధరణికోట, బెల్లంకొండ డబుల్ లైన్ రోడ్డు నిర్మాణం, మాదిపాడు కృష్ణానది వంతెన, పులిచింతల బ్యాక్ వాటర్‌పై ఎత్తిపోతల నిర్మాణం మొదలైన కార్యక్రమాలను ప్రథమ ప్రాధాన్యతగా చేపట్టి పూర్తి చేయనున్నట్టు చెప్పారు. వివిధ గ్రామాల్లోని వాగులపై, కాలువలపై వంతెనలు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, వాటి నిర్మాణాలకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించామన్నారు. తన విజయానికి కృషిచేసిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజక వర్గ టీడీపీ నేతలు కంచేటి సాయిబాబు, షేక్ మస్తాన్, జనసేన నేతతలు శాఖమూరి శ్రీను, మైనార్టీ టీడీపీ నాయకులు మొగల్ జాన్, మండల టీడీపీ నేతలు నలజాల కోటేశ్వరరావు, నలజాల సదాశివరావు, దుద్దుల యోహాన్ తదితరులు పాల్గొన్నారు. కాపు సంఘ నేతలు లేళ్ళ వెంకటరావు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు

● పని చేయని వారి బ్యాంకు అకౌంట్లకు వేలల్లో నగదు జమ

● సిబ్బందిని తొలగించాలని ఎమ్మెల్యే కన్నాకు ఫిర్యాదు

రాజుపాలెం, జూలై 5: రాజుపాలెం మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు జరిగినట్లు మండల టీడీపీ నేతలు శుక్రవారం సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వద్ద ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా ఈ పథకం లో పనిచేస్తున్న కొంతమంది సిబ్బందిని తొలగించాలని ఎమ్మెల్యే కన్నాకు సూచించినట్లు కూటమి నేతలు తెలిపారు. ఉపాధి పథకం కింద పని చేయక పోయినా గత ప్రభుత్వంలో వైసీపీ వారికి వేల రూపాయలు నగదు వారి అకౌంట్లలో అధికారులు, సిబ్బంది జమ చేశారన్నారు. ఇందుకు సబంధించిన పూర్తి సమాచారం, సాక్ష్యాలు తమ వద్ద ఉన్నాయని, వాటిని కన్నాకు చూపిం చామన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఉపాధి సిబ్బందిని తొలగిం చాలని తాము ఎమ్మెల్యే కన్నాను కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కన్నాను కలిసిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, నేతలు, చినబోయిన రాఘవరావు, పులిబండ్ల సాంబశివరావు, గడేషు వెంకటరావు, కూటమి నేతలు తదితరులు ఉన్నారు.

బాలికల జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

సత్తెనపల్లి, జూలై 5: పల్నాడుజిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని సుగాలీకాలనీ జడ్పీ హైస్కూల్ ఆవరణలో జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్లు ఎంపికలను నిర్వహించారు. ఎంపికైన వారిలో జీ.దివ్య, జీ.నవ్య(ఇరుకుపాలెం), ఎస్.శ్రావ్య, ఎస్.శ్రావణి, సీహెచ్.యోగి లావణ్య(మాదల), బీ.చంద్రిక, కే.రోహిణి, పీ.విజయలక్ష్మి, గాయత్రి, పీ.అలేఖ్య, ఎస్.మౌనిక, ఎస్.మంజుల, పీ.గాయత్రి, వై.తేజశ్వరి, పీ.ఈశ్వరి, పీ.ప్రసన్న, అనుగీతిక, స్మైలీ (సత్తెనపల్లి), ఎస్.సంయుక్త(ధూళిపాళ్ళ), పీ.శ్వేత (భీమవరం), ఎస్‌కే.ఫర్వీన్ (క్రోసూరు), ఏ.యశశ్వి(ముప్పాళ్ళ) ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20 నుంచి అనంతపురం ఆర్‌టీడీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని పల్నాడు జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. జట్టు ఎంపికలో ఎస్‌కే రియాజ్, నాగిరెడ్డి, రామిరెడ్డి, ఎస్ఎం సుభానీ, సత్యవతి, అచ్చిరెడ్డి, నరసింహారావు, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా ఇన్నారావు

● ఉద్యోగుల ఆరోపణల నేపథ్యంలో వైద్యాధికారిణి బదిలీ



డాక్టర్ ఇన్నారావు

క్రోసూరు, జూలై 5: ఉద్యోగులు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది తీవ్ర ఆరోపణల నేపథ్యంలో క్రోసూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ బాల అంకమ్మబాయిని అధికారులు బదిలీ చేశారు. ఆమె స్థానంలో అచ్చంపేట మండలం మాదిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇన్నారావును క్రోసూరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా పూర్తి బాధ్యతలతో నియమించారు. డాక్టర్ బాల అంకమ్మబాయిని సత్తెనపల్లికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పీహెచ్‌సీ ఉద్యోగులు కొంత కాలంగా డాక్టర్ బాల అంకమ్మబాయిపై ఆరోపణలుచేస్తూ వస్తున్నారు. ఆమెను బదిలీ చేయక పోతే తామంతా మూకుమ్మడి సెలవులు పెడతామని, బదిలీ చేయించుకొని వెళ్ళి పోతామని, అవసరమైతే నిరసన, ప్రదర్శనలు చేపడతామని హెచ్చరించటమే కాక జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడాచేశారు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం ఆమెపై శాఖాపరమైన విచారణ జరిపారు. విచారణ పూర్తయిన రెండే రోజే డాక్టర్ బాల అంకమ్మబాయిని బదిలీ చేయటమే కాక ఆమె స్థానంలో డాక్టర్ ఇన్నా రావును నియమించారు. బాల అంకమ్మబాయి బదిలీతో పీహెచ్‌సీ ఉద్యోగులు, ఏఎన్ఎంలు హర్షం వ్యక్తం చేశారు.

నేడు రోటరీక్లబ్ కమిటీ ప్రమాణస్వీకారం

పిడుగురాళ్ల,జూలై5: పిడుగురాళ్ల రోటరీక్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం నేడు స్థానిక వాసవి కల్యాణమండపంలో జరుగనున్నదని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆత్మకూరి గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన అధ్యక్షుడిగా జీ.అశోక్‌బాబు, కార్యదర్శిగా నీరుమళ్ల రాజేష్, కోశాధికారిగా గుర్రం కృష్ణకాంత్, కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు ఉపయోగించాలి

కారంపూడి, జూలై 5: అతిసార వ్యాధిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు ఉపయోగించాలని ఈవోపీఆర్డీ సత్యప్రసాద్ సూచించారు. మండలంలోని ఒప్పిచర్ల ఎంపీపీ పాఠశాలలో అతిసారా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవోపీఆర్డీ సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని అన్నారు. అనంతరం స్కూల్లోని బోరునీటి శాంపిల్స్ సేకరించారు. అతిసార వ్యాధిపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ ఎంసీవో కె సుబ్బారావు, హెచ్ఎం భాస్కరరావు పాల్గొన్నారు.

ఉత్కంఠ వీరభద్రునికి విశేష అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో ఉత్కంఠ వీరభద్ర స్వామి

నకరికల్లు, జూలై 5: అమావాస్యను పురస్కరించుకొని మండలంలోని కుంకలగుంటలో ఉన్న భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్రస్వామి దేవాలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించారు. ఉత్కంఠ వీరభద్ర స్వామికి వివిధ ద్రవ్యాలతో, ఫలాలతో అభిషేకాలు చేశారు. స్వామి వారిని, భద్రకాళి అమ్మవారిని, కాశీ విశ్వేశ్వరస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. జై వీరభద్ర నామంతో దేవాలయ ప్రాంగణం, గ్రామం మారు మ్రోగింది. పూజా కార్యక్రమాలను అర్చక స్వామి మామిళ్ళపల్లి విశ్వనాథ శర్మ నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త కందిమళ్ళ చంద్రశేఖరరావు, పద్మావతి దంపతులు, జమ్ముల వెంకటేశ్వర్లు, శ్రీదేవి దంపతులు, నలమోతు చిన్నారావు, సుమతి దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

చంద్రబాబుకు హెచ్చరికలు ఆపి...

ముందు వైసీపీ సంగతి చూసుకో..!

మాజీ సీఎం జగన్‌పై వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆగ్రహం

వినుకొండ టౌన్, జూలై 5: చంద్రబాబు నాయుడిని హెచ్చరించే అర్హత, స్థాయి మాజీ సీఎం జగన్మోహరెడ్డికి లేదని, ముందు రాష్ట్రంలో వైసీపీ ఉంటుందో లేదో చూసుకోవాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఈవీఎం ధ్వంసం చేసిన కేసులో అరెస్టయి నెల్లూరు జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డిని, జగన్ రెడ్డి సమర్థిస్తూ చంద్రబాబుపై చేసిన హెచ్చరికలను వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తీవ్రంగా ఖండించారు. మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంలను ధ్వంసం చేయడం ప్రజాస్వామ్య ప్రక్రియపై దాడి చేయటమే అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా పిన్నెల్లిపై కేసు నమోదు అయిందని, చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయకముందే ఎన్నికల సంఘం పిన్నెల్లిపై కేసు పెట్టిందని తెలిపారు. జగన్ మోహన్‌రెడ్డికి అధికారం పోయిందన్న ఉక్కపోతలో అనైతిక వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇటువంటి వ్యాఖ్యలతో అదుపుతప్పితే ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ లక్ష్మీలావణ్య

భారతీయ న్యాయ సంహితలోని

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి: తహసీల్దార్

శావల్యాపురం, జూలై 5: భారతీయ న్యాయవ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహితలోని శిక్షలు, చట్టాలపై ప్రజలంతా అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ నక్కా లక్ష్మీలావణ్య పిలుపునిచ్చారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా భారతీయ న్యాయసంహితలోని శిక్షలు, చట్టాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులకు శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండియన్ ప్రొటక్షన్ టీం అధికారి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం న్యాయ వ్యవస్థలోని ఇండియన్ పీనల్ కోడ్‌ను భారతీయ న్యాయసంహితగా పేరు మార్చి 2023 డిసెంబరు 25న పార్లమెంట్‌లో ఆమోదం పొంది, 2024 జూలై 1 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. సీడీపీవో ముదివర్తి అనూరాధ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను రూపుమాపేందుకు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహితలోని చట్టాలకు అనుగుణంగా నిందితులకు కఠినమైన శిక్షలు విధించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు భారతీయ న్యాయ సంహితలోని నూతన చట్టాలు, శిక్షలపై గ్రామాల్లోని ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈవోపీఆర్డీ సుగుణ, ఎంఈవో లలితాకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత పాల్గొన్నారు.

లీడర్‌షిప్ క్యాంపునకు ఎన్‌ఈసీ విద్యార్థిని ఎంపిక



అనూష

నరసరావుపేట రూరల్, జూలై 5: ఒరిస్సా రాష్ట్రంలో ఈ నెల 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఆల్‌ఇండియా అడ్వాన్స్ లీడర్‌షిప్ క్యాంపునకు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఎన్‌సీసీ క్యాడెట్స్ పోలంరెడ్డి అనూష ఎంపికైనట్లు కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డి.సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో నాయకత్వ లక్షణాలు ఏవిధంగా పెంపొందించుకోవాలి, వ్యక్తిగతంగా ఎలా అభివృద్ధి చెందాలి, ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆర్మీలో ఉన్న ఉద్యోగ అవకాశాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

టెట్-డీఎస్సీపై అవగాహన సదస్సు

వినుకొండ టౌన్, జూలై 5: సఫలా కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో టెట్-డీఎస్సీపై పట్టణంలోని సురేష్ మహల్ రోడ్డులోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో శనివారం సాయంత్రం 4గంటలకు అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు తప్పనిసరిగా పాల్గొని సీనియర్ అధ్యాపకులు ఇచ్చే సలహాలు సూచనలు పొందాలన్నారు. పూర్తివివరాలకు 9059109619 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పింఛన్ల పంపిణీపై వివాదం.. ఒకరిపై దాడి

రొంపిచర్ల, జూలై 5: మండలంలోని పరగటిచర్ల గ్రామంలో పింఛన్ల పంపిణీ విషయంలో ఘర్షణ తలెత్తటంతో ఒకరిపై దాడిజరిగిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సీపీఎం నాయకులు కామినేని రామారావుపై 20మంది టీడీపీ వర్గీయులు దాడిచేశారని ఆయన తెలిపారు. సామాజిక పింఛన్ల పంపిణీ విషయంలో లబ్ధిదారులకు మద్దతుగా నిలవటంతో ఈ ఘర్షణ తలెత్తిందని పలువురు సీపీఎం నాయకులు తెలిపారు. దాడికి గురైన రామారావు నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా నాయకులు ఆయనను పరామర్శించారు.

కర్లకుంట గ్రామ సమాఖ్యలో నిధుల గోల్‌మాల్

● నాలుగు రోజులుగా గ్రూపు సభ్యుల ఆందోళన

రొంపిచర్ల, జూలై 5: మండలంలోని కర్లకుంట గ్రామ సమాఖ్యలో నిధుల గోల్‌మాల్ దుమారం రేపుతోంది. గత నాలుగు రోజుల నుంచి ఈ విషయంపై గ్రూపు సభ్యుల మధ్య, వీవోఏ మధ్య దుమారం చెలరేగుతుంది. దీంతో ఏపీఎం, పలువురు సీసీలు రంగంలోకి దిగారు. గ్రామం మొత్తంమీద సుమారు 55గ్రూపులు ఉన్నాయి. గ్రూపులకు రుణాలు మంజూరు చేసే సమయంలో సంబంధిత గ్రూపు సభ్యుల నుంచి వీవోఏ నగదు తీసుకున్నారని సభ్యులు ఆరోపిస్తున్నారు. గ్రామ సమాఖ్య పొదుపులో ఉన్న డబ్బులు మాయమయ్యాయని ఆరోపిస్తున్నారు. ఎంతమేర నిధులు గోల్‌మాల్ అయ్యాయనేది బయటకు రావటంలేదు. సరైన కాగితాలు చూపించాలని గ్రూపు సభ్యులు, డ్వాక్రా సంఘ అధికారులను అడిగారు. ఐతే చేసేదేమి లేక వారు వెనుదిరిగి వెళ్లారు. కాగా ఈ విషయంపై ఏపీఎం రమేష్‌ను వివరణ కోరగా వీవోఏను మార్చే విషయంలో వివాదం తలెత్తిందని, మరొక విషయం లేదని పేర్కొన్నారు.



ఈపూరులో ఘన, ద్రవ బీజామృతాలు తయారుచేసి వివరిస్తున్న రామచంద్రన్

ప్రకృతి వ్యవసాయంతో భూమికి ప్రయోజనం

● స్టేట్ రీసోర్స్ పర్సన్ రామచంద్రన్

ఈపూరు, జూలై 5: ప్రకృతి వ్యవసాయంతో పంటలు పండించడం వలన నాణ్యమైన దిగుబడులు రావడంతో పాటు భూమికి కూడా ప్రయోజనం కలుగుతుందని స్టేట్ రిసోర్స్‌పర్సన్ రామచంద్రన్ అన్నారు. నియోజకవర్గంలోని శావల్యాపురం, నూజెండ్ల, బొల్లాపల్లి, వినుకొండ, ఈపూరు మండలాల కృషి సఖీలకు శుక్రవారం ఈపూరులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజామృతం, ద్రవజీవామృతం తయారుచేసే విధానం, ఉయోగించడంపై వివరించారు. బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వలన మొలకశాతం ఎక్కువగా వస్తుందన్నారు. దీంతో భూమి నుంచి వచ్చే తెగుళ్ళు నివారించవచ్చునన్నారు. జీవామృతం ద్వారా భూమిలో ఉన్న ఉపయోగకరమైన సూక్ష్మజీవులు వృద్ధిచెంది మొక్కలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. భూమిలో ఘన జీవామృతం వేయడం వలన కర్బనశాతం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పెరటి తోటలు పెంచడంవలన ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకు కూరలు లభించడంతో పాటు కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ సైదయ్య డీఎంఎంటీ ప్రకాష్, ఎంటీ తిరుపతిరావు, యూనిట్ ఇన్‌చార్జి శివలక్ష్మి, వేణుగోపాల్, లక్ష్మానాయక్, సీసీలు సుబ్బారావు, యానిమేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారులన్నీ మెరవాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

● అధికారులతో కలిసి పట్టణంలో రోడ్ల పరిశీలన



అధికారులతో కలిసి పట్టణంలో రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, జూలై 5: పట్టణంలోని ప్రధాన ప్రాంతాలలో రోడ్లు అధ్వానంగా లేకుండా, రోడ్లు మెరవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని మల్లమ్మ సెంటర్ ఫ్లై ఓవర్ కింద నుంచి బాబాపేట ఫ్లై ఓవర్ వరకు మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఇంజనీర్‌లతో కలిసి పరిశీలించారు. చిత్రాలయా థియేటర్ రోడ్డులో అడుగుకో గుంతతో అధ్వానంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలను, మరమ్మతులను గాలికి వదిలేసిందని విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇసుక, మద్యం తరలించి జేబులు నింపుకోవడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధి పనులపై కనీసం కూడా లేకుండా పోయిందన్నారు. అడుగడుగునా గుంతలు ఇంత స్పష్టంగా కనిపిస్తున్నా అప్పటి ఎమ్మెల్యే ఎందుకు పనులు చేయలేదని ప్రశ్నించారు. ఇలాంటి దుర్మార్గపు వ్యక్తులు పాలకులుగా ఉండడానికి కనీస అర్హత కూడా లేదన్నారు. తక్షణమే రోడ్డు పనులకు అంచనాలు తయారుచేసి పనులు మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల గురించి కనీసం కూడా పట్టించుకోని పాలకుడు కాబట్టే ప్రజలంతా ఏకమై విసిరి కొట్టారని ఎద్దేవా చేశారు. తెలుగుదేశం పాలనలో అభివృద్ధికి ప్రాధాన్యమిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టి పనులు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, బులియన్ మర్చంట్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, శాఖమూరి రామ్మూర్తి, కొట్టా కిరణ్‌కుమార్, మాబు, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు బస్టాండ్ పరిశీలన

పల్నాడు బస్టాండ్‌కు మహర్దశ కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ పక్కనున్న పల్నాడు బస్టాండ్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ దశాబ్దాలుగా కనీస సదుపాయాలు లేక బస్‌స్టాండ్‌కు వచ్చిన ప్రజల అవస్థలు పడుతున్నారన్నారు. గతంలో పాలకులు పట్టించుకోలేదని, కానీ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యం అన్నారు. వీలైనంత త్వరగా ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ మేరకు పల్నాడు బస్టాండ్ నుంచి త్వరలో సర్వీసులు ప్రారంభించి ప్రజలు తోడుగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం, మున్సిపల్ కమిషనర్, ఆర్టీసీ సివిల్ ఇంజనీర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



మున్సిపల్ కార్యాలయం అవరణలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే జీవీ, పక్కన మాజీ ఎమ్మెల్యే మక్కెన, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దస్తగిరి, అధికారులు

వినుకొండ, జూలై 5: అమ్మ పేరుతో ప్రతి ఒక్కరు తప్పని సరిగా ఒక మొక్కలను పెంచాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు వినుకొండ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కమిషనర్ తోట కృష్ణవేణి ఆధ్వర్యంలో అమ్మపేరుతో మొక్కలు నాటే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతోపాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు మున్సిపల్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను అమ్మను చూసుకున్నట్లు జాగ్రత్తగా చూసుకోవాలని అధికారులను కోరారు. ప్రతి ఒక్కరూ తమ తల్లులను గౌరవించేలా ఒక మొక్కను నాటండి అని దేశ ప్రధాని అని దేశ ప్రధాని మోడీ ప్రజలకు ఇచ్చిన పిలుపు అని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ దస్తగిరి, బీజేపీ నాయకులు లెనిన్, మేడం రమేష్, టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్, యువ నాయకులు పీవీ సురేష్, పత్తి పూర్ణ, సుంకర శ్రీను, గంధం కోటేశ్వరరావు, ల్యాబ్ శ్రీను, జిమ్ జానీ, పువ్వాడ నాగేశ్వరరావు, మున్సిపల్ డీఈఈ వెంకయ్య కౌన్సిలర్లు. ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల, జూలై 5: మండలంలోని సాతులూరు సబ్ స్టేషన్ పరిధిలోని సాతులూరు, చందవరం డైరీ ఫాం పరిశ్రమ తదితర ప్రాంతాల్లో కొత్త లైన్‌ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. అదేవిధంగా చిలకలూరిపేట టౌన్-2 పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పండరీపురం, మార్కండేయనగర్, సుగాలీ కాలనీ, శాంతినగర్, ఆది ఆంధ్రా కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల వల్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు.

కృష్ణాపురంలో ద్విచక్రవాహనం చోరీ

కృష్ణాపురం (శావల్యాపురం) జూలై 5: ఇంటిముందున్న పశువుల పాకలో పార్క్‌చేసిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన మండలంలోని పోట్లూరు పంచాయతీ పరిధిలోని కృష్ణాపురంలో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కృష్ణాపురం గ్రామానికి చెందిన గోనుగుంట్ల బ్రహ్మయ్య తన హెచ్ఎఫ్ డీలక్స్ బైకును గురువారం రాత్రి తన ఇంటి ముందున్న పశువుల పాకలో పార్క్ చేశాడు. శుక్రవారం ఉదయం వెళ్ళి చూసేసరికి బైకు కనిపించకపోవడంతో ఇరుగుపొరుగువారిని ఆరా తీసినా ఆచూకీ తెలియకపోవడంతో బైకు చోరీకి గురైందని గుర్తించాడు. వెంటనే శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు బ్రహ్మయ్య తెలిపాడు.

నేడు తిరుమలకు తెలుగు మహిళల పాదయాత్ర

వేల్పూరు (శావల్యాపురం) జూలై 5: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి ఘన విజయాన్ని సాధించిన సందర్భంగా జడ్పీటీసీ పారా హైమావతి ఆధ్వర్యంలో మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన 20మంది మహిళలు కాలినడకన తిరుపతికి వెళ్ళి వెంకటేశ్వర స్వామికి మొక్కుబడులు తీర్చుకునేందుకు శనివారం పాదయాత్ర చేపట్టనున్నారు. శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు శనివారం వేల్పూరుకు వచ్చి పాదయాత్రను ప్రారంభించి వారికి సంఘీభావం తెలపనున్నారు. ఎమ్మెల్యేతో పాటు వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొని పాదయాత్ర ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు కోరారు.

నేడు అధికారులతో సమీక్ష

వినుకొండ టౌన్, జూలై 5: ఈ నెల 17 తేదీన పట్టణంలో జరిగే తొలి ఏకాదశి ఉత్సవాల సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వివిధ శాఖల అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించనున్నట్లు కమిషనర్ తోట కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొనట్లు ఆమె తెలిపారు. అధికారులు తప్పనిసరిగా సమావేశానికి ఉదయం 11 గంటలకు హాజరు కావాలని ఆమె ఆదేశించారు.

టిడ్కో పాయింట్ ఆటో డ్రైవర్ల కొత్త యూనియన్

చిలకలూరిపేట, జూలై 5: ఏఐటీయూసీ అనుబంధ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ టిడ్కో పాయింట్ నూతన కమిటీని శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షులుగా ఎన్ కృష్ణ, ఉపాధ్యక్షులుగా గంగవరపు ఏసుబాబు, కార్యదర్శిగా రేపూడి రాజేష్, సహాయ కార్యదర్శిగా కుప్పం వెంకటేశ్వర్లు, కోశాధికారిగా శివ ప్రసాంజనేయులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులుగా ఎన్నికైన నాగభైరు రామ సుబ్బాయమ్మ, పేలూరి రామారావు, సీపీఐ నాయకులు బొంతా భగత్‌సింగ్ పాల్గొన్నారు.

ఆశ్రమంలో వృద్ధులకు పింఛన్లు ఇవ్వాలని వినతి



వృద్ధులతో కలిసి తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందచేస్తున్న గుమ్మడి వృద్ధాశ్రమం నిర్వాహకులు గుమ్మడి వెంకటేశ్వర్లు

వినుకొండ జూలై 5: స్థానిక వెల్లటూరు రోడ్డు లోని గుమ్మడి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పింఛను మంజూరు చేయాలని, వృద్ధాశ్రమ నిర్వాహకులు గుమ్మడి వెంకటేశ్వర్లు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బ్రహ్మయ్యను కలిసి శుక్రవారం వినతిపత్రం అందచేశారు. ఐదు సంవత్సరాలుగా వృద్ధాశ్రమంలో నివాసం ఉంటున్న ఎస్కే హుస్సేన్‌బీ, బి.ప్రతాపుల అంకమ్మలకు చూపులేదని, భూమా సుధాకర్ దివ్యాంగుడని, పింఛన్‌కోసం ఎన్నోసార్లు వినతిపత్రం అందచేశామని, కాళ్లు అరిగేలా ఆధార్ సెంటర్ చుట్టూ తిరిగి అర్హత పత్రాలతో పెన్షన్‌కు దరఖాస్తుచేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. వృద్ధాశ్రమంలో నివాసం ఉంటున్న వృద్ధుల స్థితిగతులను చూసి, పెన్షన్ మంజూరు చేయాలని తహసీల్దార్ బ్రహ్మయ్యను గుమ్మడి వేడుకున్నారు.

ఎమ్మెల్యే ఇంట్లో దాడిపై కేసు నమోదు

నరసరావుపేట లీగల్, జూలై 5 : స్వల్ప వివాదం నేపథ్యంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఇంట్లో గురువారం ఓ యువకుడిపై దాడి జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పట్టణంలోని ఐలా బజారుకు చెందిన సాయి, ప్రసాదుతో పాటు మరో 38మందిపై మొదటి పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. పట్టణ శివారు శ్రీనివాసనగర్‌కు చెందిన అల్లూరి హరికృష్ణపై స్వల్ప వివాదం నేపథ్యంలో ఎమ్మెల్యే సమక్షంలో మాట్లాడుకుందామని పిలిపించి ఐలా బజారుకు చెందిన సుమారు 40మంది యువకులు దాడి చేసినట్టు బాధితుడు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వలంటీర్‌తో విద్యా బోధన .. ఎంఈవో తనిఖీలో వెల్లడి

అనుమతి లేకుండా బోధనపై ఆగ్రహం

నాదెండ్ల, జూలై 5 : మండలంలోని గణపవరం గ్రామంలో రాజీవ్‌గాంధీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలికి బదులు వలంటీరుతో పాఠాలు బోధిస్తున్న విషయాన్ని ఎంఈవో శ్రీలక్ష్మి ఆకస్మిక తనిఖీలో శుక్రవారం బయట పడింది. గ్రామంలోని రాజీవ్‌గాంధీ, చవిటిపాలెం ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో శ్రీలక్ష్మి ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ కాలనీ పాఠశాలలో వలంటీరు పాఠాలు బోధిస్తున్న విషయాన్ని గుర్తించి ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణను ప్రశ్నించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వలంటీరుతో పాఠాలు చెప్పించటంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం వలంటీర్ల వ్యవస్థ లేనందున ఉపాధ్యాయులే బోధన చేయాలన్నారు. అనారోగ్య సమస్యలు ఉంటే విద్యా శాఖ అధికారుల అనుమతితో మాత్రమే వలంటీరును నియమించుకోవాలని సూచించారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఏడీఏ మస్తానమ్మ



విత్తనాల దుకాణాలలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

నరసరావుపేట రూరల్, జూలై 5: రైతులకు నాణ్యతలేని నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వ్యవసాయ శాఖ ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. పల్నాడు జిల్లాలో డీలర్లపై తనిఖీ చేసేందుకు వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులతో రెండు బృందాలను పల్నాడు జిల్లాలో ఏర్పాటు చేసినట్లు వ్యవసాయశాఖ ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. జిల్లాలోని పలుచోట్ల తనిఖీలు చేసి సరైన పత్రాలు లేని విత్తనాలను గుర్తించి సుమారుగా రూ.4,77,400 రూపాయలను విలువచేసే విత్తనాలను అమ్మకాలను నిలుపుదల చేసినట్లు తెలిపారు. ఎవరైనా విత్తన, ఎరువుల, పురుగుమందుల డీలర్లు గాని నాణ్యత లోపించిన వ్యవసాయ వనరులను రైతులకు అమ్మ చూపితే కఠినమైన చర్యలను తీసుకుంటారని టీం ఇన్చార్జ్ వెంకటేశ్వరరావు, విజిలెన్స్ ఎస్ఐ రవికుమార్ హెచ్చరించారు. రెండో టీం ఇన్చార్జి సీహెచ్ శ్రీనివాస రావు, విజిలెన్స్ ఎస్సై రామచంద్రయ్య ట్రాన్స్పోర్ట్ ఏజెన్సీలను, డీలర్ షాపును తనిఖీ చేసి సరైన కాగితాలు చూపని కారణంగా రూ.1,26,500/- బయో స్టిములెన్స్‌ను, పురుగుమందులను సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు. విత్తన డీలర్ల దగ్గర సరైన ప్రిన్సిపల్ సర్టిఫికేట్ లేనందువలన మొక్కజొన్న విత్తనాలను రూ.4,08,లక్షల విలువచేసే మొక్కజొన్న విత్తనాల అమ్మకం నిలిపివేసినట్లు తెలిపారు. ఈ బృందాలతో పాటు నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ ఏవో నరేంద్రబాబు లైజనింగ్ ఆఫీసర్స్ ఏవో ప్రవీణ్, వరలక్ష్మి ఏఈవో బ్రహ్మయ్య, రామిరెడ్డి మస్తాన్‌వలి పాల్గొన్నారు.

రాజకీయాల్లో అవినీతి సామ్రాట్ జగన్

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 5: రాష్ట్ర రాజకీయాల్లోనే అవినీతి సామ్రాట్ అన్న బిరుదును మాజీ ముఖ్యమంత్రి జగన్, అతడి పార్టీ వైసీపీ సార్థకం చేసుకున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఎద్దేవా చేశారు. శుక్రవారం తన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్, వైసీపీ పార్టీపై విరుచుకుపడ్డారు. తండ్రి చాటు బిడ్డగానే లక్ష కోట్లు కొట్టేసిన ఘనుడు గడిచిన ఐదు సంవత్సరాలుగా దోపిడీలో విశ్వరూపం చూపించారన్నారు. వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి తవ్వేకొద్దీ వెలుగు చూస్తున్న జగన్ అవినీతి, అక్రమాలు ఇందుకు నిదర్శనమన్నారు. హద్దు, అదుపు లేని అవినీతి కారణంగా ఇప్పుడు ఆధారాల ధ్వంసానికి వైసీపీ గ్యాంగ్ తెగబడుతున్నారన్నారు. వారు ఏ తప్పు చేయకుంటే వరుసగా ఫైళ్ళ దహనం సంఘటనలకు ఎందుకు పాల్పడుతున్నారని ప్రశ్నించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి అరాచకాలకు కాలం చెల్లిందని, రేపో మాపో అతని పాపం పండి జైలుకుపోవటం ఖాయమన్నారు. పెద్దిరెడ్డి కనుసన్నల్లో జరిగిన వేల కోట్ల దోపిడీ, పర్యావరణ విధ్వంసంపై నిజాలు సమాధి చేయటానికే పీసీబీ ఆఫీసు దస్త్రాలు, హార్డ్‌డిస్క్‌లు నాశనం చేయాలని చూశారన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన ఏ ఒక్కరు తప్పించుకుపోయే అవకాశం లేదన్నారు. ప్రజలు అధికారం ఇచ్చింది వారికి సేవ చేయటానికే అనే విషయం మరచిపోయి కొందరి కీలు బొమ్మలాంటి అధికారులను అడ్డం పెట్టుకొని ఖజానాతో పాటు ప్రకృతి వనరులను ఇష్టానుసారం కొల్లగొట్టిన ప్రతి ఒక్క వైసీపీ నేత చట్టం ముందు నిలబడే రోజులు త్వరలోనే రానున్నాయని, వారిలో ఏ ఒక్కరిని వదిలి పెట్టినా రాష్ట్ర భవిష్యత్‌కు, ప్రజలకు ద్రోహం చేసినట్లే అవుతుందని, ఇక నుంచి నాడు అడ్డదారులు తొక్కిన వారికి కౌంట్ డౌన్ మొదలైనట్లేనని ప్రత్తిపాటి హెచ్చరించారు.



మొక్కు తీర్చుకునేందుకు కసుమూర్ దర్గాకు తరలివెళుతున్న కారుచోలకు చెందిన టీడీపీ మైనారిటీ మహిళలు, నాయకులు

కసుమూర్ దర్గాకు మైనారిటీ మహిళల యాత్ర

కారుచోల (యడ్లపాడు), జూలై 5: యడ్లపాడు మండలం కారుచోల తెలుగుదేశం పార్టీకి చెందిన మైనారిటీ మహిళలు, నాయకులు శుక్రవారం నెల్లూరు జిల్లాలోని కసుమూర్ దర్గాకు తరలివెళ్ళారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతోపాటు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, చిలకలూరిపేట నుంచి ప్రత్తిపాటి పుల్లారావు ఎమ్మెల్యేగా గెలుపొందాలని గతంలో కోరుకున్నట్లు యాత్రకు వెళుతున్న మహిళలు తెలిపారు. తాము కోరుకున్న విధంగా జరగడంతో దర్గాలో మొక్కులు చెల్లించుకునేందుకు వెళుతున్నట్లు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నానికి దర్గాకు చేరుకుని ప్రార్థనల్లో పాల్గొని మొక్కులు తీర్చుకుంటామన్నారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ టీడీపీలో ముస్లింలకు ప్రత్యేకస్థానం ఉందన్నారు. ముస్లింల సంక్షేమం, అభివృద్ధి ఒక్క టీడీపీతోనే సాధ్యమన్నారు.

ఉన్నత పాఠశాలలో డీఈవో ఆకస్మిక తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డీఈవో

నాదెండ్ల, జూలై 5: మండలంలోని గణపవరంలోని కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలను పల్నాడు డీఈవో ఎం.వెంకటేశ్వర్లు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచిచూశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? అనే విషయంపై ఆరా తీశారు. తరగతి గదుల్లో పాఠ్యాంశాల బోధన ప్రక్రియను పరిశీలించారు. అనంతరం జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేయటం ద్వారా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఉపాధ్యాయులను కోరారు. ఆయనతోపాటు ప్రధానోపాధ్యాయుడు కృష్ణా నాయక్ తదితరులు ఉన్నారు.

మృతదేహం దహనంపై వదంతులు

● పరిశీలించిన పోలీసులు



మృతదేహం దగ్ధమైనట్లు భావిస్తున్న అటవీ ప్రాంతం

యడ్లపాడు, జూలై 5: యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్ పేట గ్రామసచివాలయం వెనుక కొండవీడు కొండల సమీపంలోని పూలలొద్ది ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో గుర్తుతెలియని మృతదేహంను కాల్చివేశారంటూ శుక్రవారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. దీనితో పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి పరుగులు తీశారు. దహనమైన ప్రాంతంతోపాటు చుట్టుపక్కల పరిశీలించిన పోలీసులకు ఎలాంటి మృతదేహం లభించలేదు. అయితే దహనమైన ప్రదేశంలోని బూడిదలో కొన్ని ఎముకలను గుర్తించి ఫోరెన్సిక్ విభాగానికి పంపించారు. అయితే వారు అవి మనిషికి చెందినవి కాకపోవచ్చని, అడవి జంతువుకు చెందినవై ఉండవచ్చని చెప్పారు. పరీక్షల అనంతరం అవి మనిషివా లేదా జంతువు ఎముకలా అనేది వెల్లడిస్తామని తెలిపారు. చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాస రెడ్డి, యడ్లపాడు ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించి స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎస్ఐను ఈ విషయమై వివరణ కోరగా సంఘటన జరిగి మూడు రోజులకు పైగా అయి ఉంటుందన్నారు. గొర్రెల కాపరుల ద్వారా సచివాలయ వీఆర్వోకు సమాచారం అందగా ఆయన పోలీసులకు ఫిర్యాదుచేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

నాదెండ్ల సహకార సంఘ భవనానికి మారిన కార్యకలాపాలు



నాదెండ్ల, జూలై 5: వైసీపీ నాయకుల వైఖరితో మూడు సంవత్సరాల తరువాత ఎట్టకేలకు సహకార సంఘ కార్యకలాపాలు నాదెండ్ల సహకార సంఘ భవనంకు మారాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అధికారులు సంఘ కార్యకలాపాలను నాదెండ్లలో ప్రారంభించారు. గతంలో తూబాడు, నాదెండ్ల సహకార సంఘాలు వేర్వేరుగా ఉండేవి. 1985లో అప్పటి నాదెండ్ల అధ్యక్షుడు నల్లమోతు రాజేంద్ర ప్రసాదు నాదెండ్లలో సహకార సంఘ భవనాన్ని నిర్మాణం చేయించారు. అదేవిధంగా అప్పటి జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్‌గా, తూబాడు సంఘ అధ్యక్షుడిగా పని చేసిన మానం వెంకటేశ్వర్లు తూబాడు సహకార సంఘానికి శాశ్విత భవనాన్ని నిర్మాణం చేయించారు. ఆ తరువాత కాలంలో తూబాడు సంఘాన్ని నాదెండ్ల సహకార సంఘంలో విలీనం చేశారు. అప్పటి నుంచి నాదెండ్లలోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత త్రీమెన్ కమిటీలను నామినేట్ చేశారు. కొంతకాలం ఆ కమిటీల ఆధ్వర్యంలో నాదెండ్లలోనే కార్యకలాపాలు నిర్వహించారు. తరువాత అధికారం మాది, మా ఇష్టం అంటూ తూబాడు గ్రామంలో ఉన్న సంఘ భవనానికి కార్యకలాపాలు మార్చారు. ఈ విషయమై రైతులు జిల్లా అధికారులకు ఫిర్యాదుచేసినా ఎలాంటి స్పందన వారి నుంచి రాలేదు. టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు అధికారం చేపట్టడంతో అధికారుల ఆదేశాల మేరకు కార్యకలాపాలను నాదెండ్లలోని సంఘ భవనానికి మార్చటం విశేషం.